# వార్తపత్రిక

జాతీయ తెలుగు దినపత్రిక

vaarthapatrika.com / epaper.vaarthapatrika.com

TS-02-0297488



vaarthapatrika.com

విలేకరులు కావలెను

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను అక్షర రూపం దాల్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే వార్తపత్రిక జాతీయదినపత్రిక స్వాగతం పలుకుతుంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా వార్తపత్రికలో, జిల్లాల బ్యూరోలు, మండలలా రిపోర్టర్‌గా పని చేయుటకు జిల్లా, నియోజకవర్గ స్థాయుల్లో ఉత్సహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్
9490617567



ఎడిటర్ : మరే చిన్నబాబు తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 01 సంచిక : 20 సోమవారం , ఫిబ్రవరి 16, 2026 , పేజీలు -08 వెల : 2 /-






## మా ప్రభుత్వం నుంచి సంక్షేమం

# ఆశించకండి

● ప్రభుత్వ పథకాలు, సాయంపై ఆశ పెట్టుకోవద్దు ● భూముల కోసం దళిత, గిరిజనులు ఎదురుచూడొద్దు ● మీకిచ్చేందుకు ప్రభుత్వం దగ్గర ఎలాంటి భూముల్లేవు ● సేవాలాల్ జయంతి వేడుకల్లో తేల్చిచెప్పిన రేవంత్ ● పురపోరు పూర్తవగానే చేతులెత్తేసేలా వ్యాఖ్యలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 15:**ఆరు గ్యారెంటీలు, 420 హామీలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులెత్తేశారు. పథకాలపై ఆశ పెట్టుకోవద్దని, సంక్షేమ శకం ముగిసిందని చెప్పారు. ప్రభుత్వం సాయం చేస్తుందని దళిత, గిరిజనులు ఎదురుచూడొద్దని కరాకండిగా తేల్చిచెప్పారు. ఉన్నత చదువులు చదువుకోవాలని, అందుకు ఎంతడిగినా సాయం అందిస్తామని వివరించారు. ఆదివారం ఉదయం బంజారాభవన్‌లో ఏర్పాటుచేసిన సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలకు గిరిజన శాఖ మంత్రి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.'ఒకప్పుడు ఇందిరాగాంధీ హయాంలో సీలింగ్ యాక్ట్ ప్రకారం భూములను తీసుకొని అసైన్‌మెంట్ పట్టాల రూపంలో పంచారు. ఇప్పుడు పంచడానికి ప్రభుత్వం వద్ద భూములు లేవు. దళితులకు, గిరిజనులకు నాది ఒక్కటే సూచన. ఆనాడున్న పరిస్థితుల్లో సంక్షేమం, అభివృద్ధిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక విధానం తీసుకున్నది. కానీ నేడు ఆ శకం ముగిసింది. ఇవ్వాళ భూములు ఇవ్వాలన్నా మిగతా2లో...


## నేడు ఏపీలో పర్యటించనున్న బిల్ గేట్స్



**హైదరాబాద్, ఫిబ్రవరి 15:** మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపక అధినేత బిల్ గేట్స్ సోమవారం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించను న్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో కీలక రంగాల్లో భాగస్వామ్యంపై చర్చించేందుకు ఆయన తన బృందంతో కలిసి ఏపీకి వస్తున్నారు. ఈ పర్య టనలో భాగంగా ఆయన ముఖ్యమంత్రి చం ద్రబాబు, ఉప ముఖ్యమంత్రి మిగతా2లో...

## ఓం బిర్లాపై అవిశ్వాస

# తీర్మాన చర్చ మార్చి 9న



**హైదరాబాద్, ఫిబ్రవరి 15:** లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాపై ప్రతిపక్షం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ, తదుపరి ఓటింగ్ మార్చి 9న జరుగుతుందని, విరామం తర్వాత సభ తిరిగి సమావేశమ వుతుందని కేంద్రపార్లమెంటరీ వ్యవహా రాల మంత్రి కిరణ్ రిజిజు ఆదివారం తెలిపారు. షెడ్యూల్ ప్రకారం.. బడ్జెట్ సెషన్ రెండవ దశ మార్చి 9 నుండి ఏప్రిల్ 2 వరకు కొనసాగుతుందని అన్నారు. పలు ముఖ్యమైన చట్టాలు, క్లిష్టమైన బిల్లులపై పార్లమెంటులో చర్చ, ఆమోదం కోసం సమర్పించనున్నట్లు తెలిపారు. మార్చి 9న లోక్‌సభ తిరిగి ప్రారంభమైన తర్వాత అవిశ్వాస తీర్మానంపై చర్చ మిగతా2లో...

## ఈనెలలోనే రెండు

# అల్పపీడనాలు..

నేడు, 19 తర్వాత ఏర్పడే అవకాశం

25 నుంచి 28 వరకు వర్షాలు

వెల్లడించిన వాతావరణ శాఖ

వివరాలు 2లో



# రైతులకు ద్రోహమే...

వ్యవసాయ సార్వభౌమత్వాన్ని రాజీ పడేలా చేస్తుంది

ఇది అన్నదాతల భవిష్యత్తుకు సంబంధించిన విషయం

కేంద్రం తీరుపై రాహుల్ తీవ్ర ఆగ్రహం

అమెరికాతో ట్రేడ్ డీల్‌పై ప్రధానికి ఐదు ప్రశ్నలు



**న్యూఢిల్లీ ఫిబ్రవరి 15:** అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోన్న తీరుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వాణిజ్య ఒప్పందం పేరుతో భారతీయ రైతులు మోసపోవడాన్ని కండ్లారా చూస్తున్నా మనీ, దేశ వ్యవసాయ సార్వభౌమత్వాన్ని రాజీ పడేలా చేస్తోందని ఉద్ఘాటించారు. ఇది తాత్కాలిక అంశం కాదనీ, రైతుల భవిష్యత్తుకు సంబంధిం చిందన్న ఆయన.. ప్రధాని మోడీకి ఐదు ప్రశ్నలు సంధించారు. ''డ్రైడ్ డిస్టిల్లర్స్ గ్రెయిన్స్ (డీడీజీ) దిగుమతి చేసుకోవడం అంటే ఏమిటీ? జన్యుమార్పిడి చేసి న (జీఎం) అమెరికన్ మొక్కజొన్న నుంచి తయారైన మిగతా2లో...



## హంగ్ మున్సిపాలిటీల కోసం కాంగ్రెస్ అరాచకం: కేటీఆర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 15:**రాష్ట్రంలో ఇటీవల ఎన్నికలు జరిగిన మున్సిపాలిటీల్లో హంగ్ ఏర్పడిన 34 చోట్ల అధికారాన్ని చేజిక్కించుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ అరాచకాలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. కౌన్సిలర్లను కిడ్నాప్ చేయడం, ప్రలోభ పెట్టడం, ఇళ్లకు పోలీసులను పంపడం, గూండాలను ఉపయోగించడం వంటి చర్యలకు దిగుతోందని ఆయన విమర్శించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో జరిగిన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో మిగతా2లో...

## సూపర్8.. పాక్‌పై

# భారత్ ఎనిమిదో విజయం

ప్రపంచకప్‌లో అప్రతిహత రికార్డు ఇషాన్ కిషన్ విజృంభణ

బౌలర్ల సమష్టి ప్రదర్శన టీమ్‌ఇండియాకు సూపర్-8 బెర్తు



టీ20 ప్రపంచకప్‌లో భారత్ దుమ్మురేపింది! ప్రియమైన ప్రత్యర్థి పాకిస్థాన్‌పై బెబ్బులిలా విరుచుకుపడింది. సండే బ్లాక్‌బస్టర్‌లో టీమ్‌ఇండియా పాక్‌ను చిత్తుచిత్తుగా ఓడించింది. మెగాటోర్నీలో తమ అజేయ రికార్డును అప్రతిహతంగా కొనసాగిస్తూ ఏకంగా ఎనిమిదోసారి విజయఢంకా మోగించి..మరో మ్యాచ్ మిగిలుండగానే సూపర్-8 బెర్తు ఖరారు చేసుకుంది. కొలంబో గడ్డ మీద త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా రెపరెపలాడించింది. ప్యాకెట్ డైనమైట్ ఇషాన్ కిషన్ ధనాధన్ అర్ధసెంచరీతో చెలరేగిన వేళ పోరాడే స్కోరు అందుకున్న టీమ్‌ఇండియా సమష్టి ప్రదర్శనతో సత్తాచాటింది. పాక్ బౌలర్లను ఉతికిఆరేస్తూ కిషన్ బౌండరీలతో శివతాండవం చేశాడు. బుమ్రా, హార్దిక్ పాక్‌ను ఆదిలోనే దెబ్బతీయగా, అక్షర్, వరుణ్ మిగతా లాంఛనాన్ని పూర్తి చేశారు. వీరి ధాటికి 114 పరుగులకే కుప్పకూలిన పాక్ 61 పరుగుల తేడాతో మట్టికరించింది. హ్యాట్రిక్ విజయాలతో డిఫెండింగ్ చాంపియన్ భారత్ టాప్ గేర్‌లో దూసుకెళుతుండగా, పాక్ సూపర్-8 ఆశలు మిణుకుమిణుకుమంటున్నాయి.




## ఒక మున్సిపాల్టీ గెలిస్తే దాన్ని లాక్కుంటారా?

- బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు తప్పదు : కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, ఫిబ్రవరి 15:**మున్సిపల్ ఎన్నికల్లో తాము ఒక మున్సిపాల్టీని గెలిస్తే ఆ ఒక్క సీటును కాంగ్రెస్ లాక్కుందని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. రాష్ట్రంలో ప్రతిపక్షం, అడిగేవారు ఉండకూడదా? అని ఆమె మిగతా2లో...

## శివనామస్మరణతో మారుమోగుతున్న

# పుణ్యక్షేత్రాలు..



**హైదరాబాద్, ఫిబ్రవరి 15:**మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శైవ క్షేత్రాలు భక్తజనసందోహంతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పవిత్ర నదులు, కోనేర్లలో స్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకుంటున్నారు. నంద్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలంలో మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. స్వామి అమ్మవార్ల ప్రభోత్సవం భక్తులకు కనుల విందుగా నిలిచింది. **శ్రీశైలంలో ప్రభోత్సవం - నందివాహన సేవ:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైల క్షేత్రంలోని ప్రధాన వీధిలో గంగాధర మండపం వద్ద అర్చకులు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రభోత్సవాన్ని ప్రారంభించారు. రంగురంగుల పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించిన ప్రభపై మిగతా2లో...

## కేరళ సీఎంగా మళ్లీ విజయనే...

- కేంద్రమాజీమంత్రి, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత మణిశంకర్ అయ్యర్ ఆశాభావం




2లో

# మా ప్రభుత్వం నుంచి సంక్షేమం ఆశించకండి

(మొదటి పేజీ తరువాయి)

మా దగ్గర అందుబాటులో లేవు. ఇక భూముల గురించి, ప్రభుత్వమిచ్చే సంక్షేమం గురించి ఆలోచించవద్దు. మేం ఏం చేయం, మాకు భూమివ్వండి? చిన్నవ్యాపారాలు చేసుకుంటామనేది వదిలిపెట్టండి. తాత్కాలిక సంక్షేమం గురించి ఆలోచించవద్దు' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి తేల్చిచెప్పారు.అయితే గిరిజన బిడ్డలు ఎంతరవరకు చదువుకుంటారో చదువుకోవాలని, అందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఉచిత సలహా ఇచ్చారు. ఆ తర్వాత ఉచిత సన్నబియ్యం, ఉచిత బస్సు, సబ్సిడీ విద్యుత్ పథకాలు, యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తదితర వాటి గురించి ఏకరువు పెట్టారు. సేవాలాల్ బోధనలు, సామాజిక ఐక్యతకు చేసిన కృషిని కొనియాడారు. తన రాజకీయ ప్రస్థానంలో లంబాడా గిరిజనుల పాత్ర ఎంతో ఉన్నదని, వారి రుణం తీర్చుకునే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని తెలిపారు. ప్రతీ తండాకు బీటీ రోడ్లు, సోలార్ పంప్‌సెట్లు, పాఠశాల భవనాలు, గ్రామ పంచాయతీ భవనాలు, తాగునీరు, విద్యుత్ మౌలిక వసతులను కల్పించాలని ఆదేశాలు జారీ చేశామని వెల్లడించారు.**వచ్చే ఏడాది అచ్చంపేటలో వేడుకలు** రాష్ట్రంలో సంత్ సేవాలాల్ పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు అచ్చంపేట అటవీ ప్రాంతంలో 20 ఎకరాలు సేకరించామని, వచ్చే ఏడాది అకడే వేడుకలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. సేవాలాల్ భారీ విగ్రహం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీలు బలరాం నాయక్, ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రునాయక్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మాజీ మంత్రి రవీందర్ నాయక్, గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్,అదనపు సంచాలకులు సర్వేశ్వరరెడ్డి, గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ సంచాలకులు వేమూరి సముజ్వల, చీఫ్ ఇంజినీర్ బాలునాయక్, జీసీసీ జీఎం ప్రతాప్‌రెడ్డి, గిరిజన మ్యూజియం క్యూరేటర్ ద్యావనపల్లి సత్యనారాయణతో పాటు ఉన్నతాధికారులు, లంబాడా కళాకారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శివనామస్మరణతో మారుమోగుతున్న పుణ్యక్షేత్రాలు..

(మొదటి పేజీ తరువాయి)

ఆదిదంపతులు ఊరేగుతుండగా, భక్తులు శివనామ స్మరణతో పులకించిపోయారు. అనంతరం అక్కమహాదేవి అలంకార మండపంలో శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామివార్లకు నందివాహన సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. నందివాహనంపై కొలువుదీరిన స్వామివార్లను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. క్షేత్రంలోని ప్రధాన వీధులన్నీ 'ఓం నమః శివాయ' మంత్రంతో మారుమోగిపోయాయి. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.**ఏలూరు జిల్లా కైకలూరులో..** కైకలూరు నియోజకవర్గం కలిదిండిలో వెలసిన శ్రీ పాతాళ భోగేశ్వర స్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయ కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకుంటున్నారు. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో కలిదిండి శివనామస్మరణతో మారుమోగుతోంది. డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తుల జాగారం కోసం దేవస్థానం కమిటీ భారీగా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. అలాగే, కోనేరు వద్ద భక్తులు తమ పితృదేవతలకు పిండ ప్రదానాలు (పితృతర్పణం) నిర్వహించారు.అనంతపురంలో 18 వేల బాన లింగాలకు అభిషేకం..అనంతపురంలో శివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. 20 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన శివ మహోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉజ్జయినిలోని నర్మదా నది నుండి సేకరించిన 18,000 బాన లింగాలను ఇక్కడ ప్రతిష్టించారు. భక్తులందరికీ ఈ లింగాలకు అభిషేకం చేసుకునే అరుదైన అవకాశాన్ని కల్పించారు.ఏపీఐఐసీ డైరెక్టర్ చల్లా లక్ష్మీ ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో భక్తులకు బాన లింగంతో పాటు అభిషేకం కిట్‌ను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. అరుణాచలం నుండి తీసుకొచ్చిన శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు రేపు ఉదయం వరకూ కళ్యాణోత్సవం, రుద్ర హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.**శ్రీ సత్యసాయి జిల్లాలో..** ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిమ్మమ్మ మర్రిమాను క్షేత్రంలో శివరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఇక్కడ ఉన్న శివాలయంలో భక్తుల జాగారం కోసం ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తున్నాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పర్యవేక్షణలో భారీ ఏర్పాట్లు చేశారు. మర్రిమాను నీడలో వేలాది మంది భక్తులు జాగారం చేస్తున్నారు. అన్ని క్షేత్రాల్లోనూ తొక్కిసలాట జరగకుండా వాలంటీర్ వ్యవస్థ, పోలీసులు పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నారు.

# కేరళ సీఎంగా మళ్లీ విజయనే...

**తిరువనంతపురం ఫిబ్రవరి 15:** కేరళ తదుపరి ముఖ్యమంత్రిగా పినరయి విజయన్ కొనసాగుతారని కేంద్ర మాజీమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మణిశంకర్ అయ్యర్ విశ్వాసం వ్యక్తం చేశారు."విజన్ 2031: డెవలప్‌మెంట్ అండ్ డెమోక్రసీ" అనే అంతర్జాతీయ సెమినార్‌ను ఆదివారం ఇక్కడ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సమక్షంలో పంచాయతీరాజ్ వ్యవస్థను అమలు చేయడంలో కేరళ అగ్రగామి స్థానాన్ని చట్టబద్ధంగా కాపాడుకోవడానికి అవసరమైన సవరణలు ప్రతిపాదించబడుతున్నాయని అయ్యర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. భారతదేశం పట్ల మహాత్మా గాంధీ దార్శనికతను గుర్తుచేసుకుంటూ, పేద పౌరులు కూడా యాజమాన్య భావాన్ని అనుభవించి, దేశ నిర్మాణంలో చురుకుగా పాల్గొనే దేశం గురించి గాంధీజీ కలలు కన్నారని అయ్యర్ అన్నారు.ఈ ఆదర్శం వైపు అత్యంత ప్రశంసనీయమైన పురోగతి కేరళలోని వామపక్షాల పాలనలో సాధించబడిందని ఆయన గుర్తుచేశారు. వికేంద్రీకృత పాలనలో కేరళ సాధించిన విజయాలను అయ్యర్ హైలైట్ చేశారు. కేరళను ప్రజాస్వామ్యంలో దేశం యొక్క ఆచరణాత్మక నాయకుడిగా అభివర్ణించారు. స్థానిక స్వపరిపాలన పట్ల దశాబ్దాలుగా రాజకీయ నిబద్ధత చూపడం ద్వారా కమ్యూనిటీలకు సాధికారత కల్పించడం , సామాజిక ఫలితాలను మెరుగుపరచడం జరిగిందని ఆయన ప్రశంసించారు. కేరళ పనితీరు అనేక సందర్భాల్లో జాతీయ అంచనాలను మించిపోయిందని ఆయన పేర్కొన్నారు. **మణిశంకర్ అయ్యర్ ప్రసంగ పూర్తిపాఠం..** భారతదేశం కోసం తన కల గురించి 1931లో ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ, మహాత్మా గాంధీ ఇలా అన్నారు. "పేదలు కూడా తమ దేశం అని భావించే భారతదేశం కోసం నేను పని చేస్తాను, దాని నిర్మాణంలో వారికి ప్రభావవంతమైన స్వరం ఉంటుంది." మార్క్సిస్ట్ పార్టీ పాలనలో ఉన్న కేరళ, ఈ ప్రకటిత గాంధీ లక్ష్యం వైపు నిజమైన పురోగతి సాధించిన భారతదేశంలోని ఏకైక రాష్ట్రం అని మణి శంకర్ అయ్యర్ అన్నారు.

అయితే, ఈ సందర్భం జాతీయ ప్రాముఖ్యత కలిగిన రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమం అయినప్పటికీ, కాంగ్రెస్‌కు చెందిన తన సహచరులు హాజరు కాకపోవడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. సమయ పరిమితిని దృష్టిలో ఉంచుకుని, తాను నేరుగా ప్రధాన సమస్య కు వెళ్తానని ఆయన అన్నారు. మూడు అంచెల పంచాయతీ రాజ్ పాలన సాధనలో కేరళ దేశంలో మొదటి స్థానంలో ఉందని ఆయన పేర్కొన్నారు. మనతో ఇప్పుడు లేని మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఆలోచనలు కేరళలో మరే ఇతర రాష్ట్రంలో కంటే సమర్థవంతంగా అమలు చేయబడ్డాయి.అయితే, అమలులో కేరళ మొదటి స్థానంలో ఉన్నప్పటికీ, చట్టం పరంగా అది రెండవ స్థానంలో ఉందని ఆయన ఎత్తి చూపారు. కేరళకు తన మునుపటి పర్యటనను గుర్తుచేసుకుంటూ, అప్పుడు తాను ఒక నిర్దిష్ట అభ్యర్థన చేశానని చెప్పారు. రమేశ్ కుమార్ కమిటీ నివేదిక ఆధారంగా, కర్నాటక అత్యంత ప్రగతిశీల , ఆధునిక పంచాయతీ రాజ్ చట్టాన్ని రూపొందించింది. దీనిలో కమిటీ సభ్యుడిగా తాను ప్రతిపాదించిన 38 సవరణలను కూడా చేర్చారు. పంచాయతీ రాజ్ మార్గదర్శకుడిగా విస్తృతంగా పరిగణించబడుతున్న నేటి కార్యక్రమంలో పాల్గొన్న వి.కె. రామ చంద్రన్ ఈ రంగంలో నిజమైన "గురువు" అని ఆయన అన్నారు. థామస్ ఐజాక్‌కు క్షమాపణలు చెబుతూ, ఈ రంగంలో రామచంద్రన్ ప్రాధాన్యతను నొక్కి చెప్పారు. కేరళలోని అప్పటి స్థానిక స్వపరిపాలన మంత్రి ఈ సూచనలను అంగీకరించారు . ఆయన సిఫారసు చేసినట్టుగా కర్నాటక , కేరళ రెండింటి నుంచి నిపుణులు కమిటీలో పాల్గొన్నారు.కేరళ తదుపరి ముఖ్యమంత్రిగా పినరయి విజయనే ఉంటారని విశ్వాసం వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి సమక్షంలో తన విజ్ఞప్తిని మణిశంకర్ అయ్యర్ పునరుద్ఘాటించారు. పంచాయతీ రాజ్‌లో కేరళ నంబర్ వన్ స్థానాన్ని దృఢంగా భద్రపరచడానికి, కేరళ సొంత అనుభవాలు, థామస్ ఐజాక్ అంతర్దృష్టులు , ఆయన అధ్యక్షత వహించిన ఐదు సంపుటాల నివేదిక ఆధారంగా శాసన సవరణలు తీసుకురావాలని ఆయన రాష్ట్రాన్ని కోరారు. అన్నింటికంటే ముఖ్యంగా, ప్రణాళికా సంఘం పంచాయతీ రాజ్‌ను నిజంగా విశ్వసించిన సమయంలో జిల్లా ప్రణాళికపై వి.కె. రామచంద్రన్ రూపొందించిన నోట్‌కు తగిన పరిశీలన ఇవ్వాలని ఆయన అన్నారు. నేడు దేశంలో పంచాయతీ రాజ్‌ను సమర్థించే స్వరాలు చాలా తక్కువగా ఉన్నాయని ఆయన విచారం వ్యక్తం చేశారు. అందువల్ల ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు ఆయన నేరుగా విజ్ఞప్తి చేశారు: "సర్, దయచేసి కాంగ్రెస్ వదిలిపెట్టిన లక్ష్యాన్ని చేపట్టండి." అన్నారు. తన ప్రసంగాన్ని ముగిస్తూ.. "ధన్యవాదాలు, కేరళ అభివృద్ధి చెందాలి."అని అన్నారు.

# మేడారం కోవా బన్ వివాదం.. వలీకి అండగా నిలిచిన నారా లోకేష్.. త్వరలోనే కలుస్తానని హామీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 15:**మేడారం జాతరలో చోటుచేసుకున్న కోవా బన్ వివాదంపై ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ స్పందించాడు. కర్నూలుకు చెందిన చిరువ్యాపారి వలీకి అండగా నిలుస్తూ ఆయన సోషల్ మీడియా వేదికగా ఎమోషనల్ నోట్ పెట్టాడు.అసలేం జరిగిందంటే? మేడారం జాతరలో కర్నూలు జిల్లా వెలుగుగోడు గ్రామానికి చెందిన షేక్ షావలీ అనే వ్యక్తి తన సోదరుడితో కలిసి కేవలం 10 రూపాయలకే కోవా బన్ విక్రయిస్తున్నారు. అయితే, వ్యూస్ మరియు లైక్స్ కోసం కొంతమంది యూట్యూబర్లు (తేజస్వి న్యూస్ ఛానల్) అతనిని చుట్టుముట్టి. ఆ ఆహారంలో ఏదో కలిపారంటూ, అది 'ఫుడ్ జిహాద్' అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. అంతేకాకుండా.. ఆ ఆహారం సురక్షితమేనని నిరూపించడానికి వలీని అందరి ముందే దానిని తినాలని బలవంతం చేసి వేధించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, సామాన్యుల నుంచి రాజకీయ నాయకుల వరకు అందరూ



యూట్యూబర్ల తీరును తప్పుబట్టారు. తాజాగా ఇదే ఘటనపై నారా లోకేష్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ వలీకి అండగా నిలిచాడు."డియర్ బ్రదర్ వలీ, నీవు ఎదుర్కొన్న ఈ పరిస్థితికి నేను చాలా బాధపడుతున్నాను. ఇలాంటి విభజన రాజకీయాలకు, మతపరమైన వేధింపులకు మన తెలుగు సమాజంలో చోటు లేదు. మనది ఎప్పుడూ సామరస్యం, పరస్పర గౌరవం మరియు సోదరభావంతో విరాజిల్లే సమాజం. త్వరలోనే నేను నిన్ను కలుస్తాను. నీ ఫేమస్ కోవా బన్ రుచి చూడాలని ఎదురుచూస్తున్నాను. మనం అందరం కలిసి నిలబడదాం అంటూ నారా లోకేష్ రాసుకొచ్చాడు. కేవలం లోకేష్ మాత్రమే కాకుండా టీడీపీ నేతలు పరిటాల శ్రీరామ్, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, తదితరులు ఈ ఘటనపై స్పందించడమే కాకుండా వలీకి అండగా నిలిచారు.

# నేడు ఏపీలో పర్యటించనున్న బిల్ గేట్స్

(మొదటి పేజీ తరువాయి)

పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌లతో సమావేశమవుతారు.ఆదివారం అందిన సమాచారం ప్రకారం, సోమవారం ఉదయం 10 గంటలకు బిల్ గేట్స్ సచివాలయానికి చేరుకుంటారు. ముందుగా రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టీజీఎస్) కేంద్రాన్ని సందర్శించి, పాలనలో సాంకేతికత వినియోగాన్ని పరిశీలిస్తారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇతర మంత్రులు, అధికారులతో బిల్ గేట్స్ బృందం సమావేశమవుతుంది. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ఇప్పటికే అమలవుతున్న ప్రాజెక్టులను మరింతగా విస్తరించడంపై ఈ భేటీలో ప్రధానంగా చర్చిస్తారు.

# ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మాన చర్చ మార్చి 9న

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందని, పార్లమెంట్ నిబంధనల ప్రకారం తీర్మానంపై మొదటి రోజే చర్చ చేపట్టాలని అన్నారు. చర్చతోపాటు ఓటింగ్ నిర్వహిస్తామని అన్నారు. ప్రతిపక్షం సభ పనిచేసేందుకు అనుమతించకపోతే గిలెటిన్‌ను ప్రవేశపెడతామని, దాంతో వారికే నష్టమని అన్నారు. భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చ సమయంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని మాట్లాడేందుకు అనుమతించకపోవడంతో స్పీకర్ ఓం బిర్లాకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే.

# ఈనెలలోనే రెండు అల్పపీడనాలు..

**హైదరాబాద్, ఫిబ్రవరి 15:** ఆగ్నేయ బంగాళాఖాతం లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నదని, దక్షిణ బంగాళాఖాతంలో సోమవారం అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. దీని ప్రభావంతో తమిళనాడు, శ్రీలంకలో వర్షా లు కురుస్తాయని పేర్కొన్నది. తెలంగాణ, ఏపీపై ప్రభావం అంతగా ఉండకపోవచ్చని వెల్లడించింది. ఈ నెల19 నుంచి బంగాళాఖాతంలో వాతావరణ మార్పులు ఉంటాయని తెలిపింది. మొ దట ఉపరితల ఆవర్తనం ఏర్పడి, ఆ తర్వాత అల్పపీడనంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయని వివరించింది.దీంతో తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాం తాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకా శం ఉన్నదని పేర్కొన్నది. ముఖ్యంగా 25 నుంచి 28 వరకు తెలంగాణలో వర్షాలు కురిసే సూచనలున్నాయని తెలిపింది. మరోవైపు చలి తీవ్రత తగ్గడంతో రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయని, దాదాపు అన్ని జిల్లాల్లో 30 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదైయ్యాయని వెల్లడించింది. నెలా ఖరుకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరే అవకాశాలుంటాయని పేర్కొన్నది.

# రైతులకు ద్రోహమే...

(మొదటి పేజీ తరువాయి)

దాణాను భారతీయ పశువులకు తినిపించడం కాదా? ఇది మన పాల ఉత్పత్తి అమెరికా వ్యవసాయ పరిశ్రమపై ఆధారపడేలా చేయదా? జన్యుమార్పిడి చేసిన సోయాబీన్ ఆయిల్‌ను అనుమతిస్తే.. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్తాన్‌లతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న సోయాబీన్ రైతులపై ప్రభావం పడదా? మీరు చెబుతున్న ఆ 'అదనపు ఉత్పత్తులు' అంటే ఏమిటీ..? కాలక్రమేణా పప్పుధాన్యాలతోపాటు ఇతర అమెరికన్ పంటల దిగుమతులకు ద్వారాలు తెరవడమేనా? వాణిజ్యేతర అడ్డంకులను తొలగించడం అంటే ఏమిటీ? జన్యుమార్పిడి పంటలపై తన వైఖరిని మార్చడం, ధాన్యం సేకరణను తగ్గించడం, కనీస మద్దతు ధర లేదా బోనస్‌లను తగ్గించడంపై భవిష్యత్తులో భారత్ ఒత్తిడిని ఎదుర్కోనుందా? ఒకసారి ద్వారాలు తెరిచిన తర్వాత వీటిలో మరిన్ని పంటలను చేర్చకుండా ఎలా ఆపగలం? వీటికి ఏమైనా రక్షణ చర్యలు ఉన్నాయా? లేదా ఇలాగే ప్రతి ఒప్పందంలో మరిన్ని పంటలను ఈ జాబితాలో చేరుస్తారా?" అని రాహుల్ గాంధీ కేంద్రాన్ని ప్రశ్నించారు. భారత వ్యవసాయ రంగంపై మరో దేశం పట్టును సాధించేందుకు అనుమతి ఇస్తున్నామా? అని ఈ సందర్భంగా అనుమానం వ్యక్తం చేశారు.

# హంగ్ మున్సిపాలిటీల కోసం కాంగ్రెస్ అరాచకం: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్న అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. సోమవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, మేయర్ల ఎన్నిక జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని మండిపడ్డారు.

# ఒక మున్సిపాల్టీ గెలిస్తే దాన్ని లాక్కుంటారా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నించారు. అలాంటి వెగటు రాజకీయాలు చేసే బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందనీ, ఆ బాటలో వెళితే ప్రజలు కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారని ఆమె హెచ్చరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో నిర్వహించిన సంత్ సేవాలాల్ 287 జయంతి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ జీవో 33 ప్రకారం బంజారాలకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంత్ సేవాలాల్ జీవితాన్ని పాఠ్యాంశంగా దేశ వ్యాప్తంగా పుస్తకాల్లో పెట్టాలనీ, గోర్ భోళి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్ లో చేర్చాలని ఆమె కోరారు.గ్రామ పంచాయితీలుగా మారిన తండాల్లో సరైన వసతుల కల్పనకు రూ.25 లక్షలు ఇవ్వాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం జీహెచ్ఎంసీలో బంజారాలకు 5 సీట్లు అనడంలో హేతుబద్ధత లేదని ఆమె కొట్టిపారేశారు. బంజారాలకు, ఆదివాసీలకు మధ్య ఘర్షణ పెట్టేలా ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని కవిత విమర్శించారు. ఆ రెండు వర్గాల హక్కుల కోసం తాము పోరాడుతున్నామని ఆమె తెలిపారు. రెండేండ్లలో జరిగిన అడ్మిషన్లు, ప్రమోషన్లు, ఉద్యోగ నియామకాల్లో గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ అమలుపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో సేవాలాల్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కవిత కోరారు. సేవాలాల్ ఆధ్యాత్మిక గురువు మాత్రమే కాదనీ, ఇహలోకం ఎలా జీవించాలో బోధించారని ఆమె గుర్తుచేశారు. సేవాలాల్ పేరుతో, ఆదివాసీల పేరుతో, ఎరుకల తెగ పేరుతో ఏర్పాటు చేస్తామన్న మూడు కార్పొరేషన్లను వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ వేడుకల్లో బంజారా ఆధ్యాత్మిక గురువులు పలువురు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల కోసం పోరాటం: కేటీఆర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 15:**సింగరేణి కార్మికుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సింగరేణిలో జరుగుతున్న దోపిడీని అడ్డుకోవడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. సింగరేణి కార్మికుల ప్రయోజనాల దృష్ట్యా కొత్తగూడెంలో బీఆర్ఎస్ తన మద్దతు సీపీఐకి ప్రకటించిందని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ రెండూ కలిసి సింగరేణి దోపిడీలో భాగస్వాములై సంస్థను నష్టపరిచే విధంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. సీపీఐ కాంగ్రెస్ ఇప్పటికే అలయన్స్ లో ఉన్నాయనీ, కొత్తగూడెంలో మేయర్ పదవి పంచుకోవడంలో ఆశ్చర్యమేమీ లేదన్నారు. ఏఐటీయూసీ ఈ పొత్తును ఎందుకు అంగీకరించిందో తెలియదన్నారు. దాని వెనుక ఏ ఒత్తిళ్లు పని చేశాయో తాను చెప్పలేనని వ్యాఖ్యానించారు.అయితే ఎవరు కలిసి వచ్చినా, కలిసి రాకపోయినా సింగరేణి సంస్థ ప్రయోజనాలు, కార్మికుల హక్కుల కోసం గతంలో ఎట్లా పోరాడామో భవిష్యత్తులో కూడా అలాగే పోరాడుతామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## వైభవంగా మల్లికార్జున స్వామి కళ్యాణ్ ఉత్సవం



**వార్తాపత్రిక, కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 15:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జగద్గిరిగుట్ట డివిజన్ కొండపై వెలసిన శ్రీశ్రీ శ్రీ మల్లికార్జున స్వామి భ్రమరాంబ కేతమ్మ దేవాలయంలో ఆదివారం 40వ కళ్యాణోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీ మల్లికార్జున స్వామి ఆశీస్సులతో డివిజన్ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం జగద్గిరిగుట్ట డివిజన్ ప్రజలందరికీ మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జెకె. శేఖర్ యాదవ్, అధ్యక్షులు గండి రాజు యాదవ్, కమిటీ సభ్యులు అంజన్ యాదవ్, నర్సింలు, సాయిలు యాదవ్, పి. సమ్మయ్య యాదవ్, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో ...జగన్



**వార్తాపత్రిక, కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 15:** బంజారా సమాజ ఆరాధ్య దైవసమానుడైన శ్రీ సంత్ సేవాళాల్ మహారాజ్ 287వ జయంతి సందర్భంగా జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలో నిర్వహించిన జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ జగన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సేవాళాల్ మహారాజ్ జీవితం సమాజానికి శాశ్వత మార్గదర్శకమని అన్నారు. ఆయన బోధనలు ఆదివాసీ, గిరిజన వర్గాల అభ్యున్నతికి దిశానిర్దేశం చేశాయని, సమానత్వం, సామాజిక న్యాయం, ఐక్యత వంటి విలువలను ప్రజల్లో నాటాయని పేర్కొన్నారు. యువత మహారాజ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ హితానికి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ నాయక్, నర్సింగ్ నాయక్, తారా సింగ్, సునీత భాయ్, వెంకటేష్, మనోజ్ సింగ్, బాబు నాయక్, సంఘంసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కాశీ విశ్వేశ్వరుడి సన్నిధిలో మన్నే రాజు



**వార్తాపత్రిక, కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 15:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్క రించుకుని సుభాష్ నగర్ డివిజన్ సుభాష్ నగర్‌లో ఉన్న కాశీ విశ్వేశ్వర స్వామి ఆల యంలో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్ర మంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మన్నే రాజు, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనా రాయణ పాల్గొని మహాశివుని ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా భక్తుల ంద రూ ఆ భగవంతుని కృపతో సుఖసం తోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. ఆలయ ధర్మకర్త వ్యవస్థాపకుడు బిజ్జిలి సాంబయ్య ఆధ్వర్యంలో పూజా కార్య క్రమాలు నిర్వహించగా, అనంతరం మన్నే రాజు, గుబ్బల లక్ష్మీనారా యణలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసు, శ్రీనివాస్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అందే మోహన్ కె షాద్ నగర్ మున్సిపాలిటీ చైర్మన్ అవకాశం ఇస్తే అన్ని వర్గాల వారికి సమన్యాయం జరుగుతుందని

- టిఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపాగ జంగయ్య మాదిగ విజ్ఞప్తి



**వార్త పత్రిక షాద్ నగర్ ఫిబ్రవరి15:** షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోనే కాకుండా షాద్ నగర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ గత పది సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్న దానికి కట్టుబడి ఉండి అనేక ఉద్యమాలు చేసి కాంగ్రెస్ పార్టీనీ బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించిన యువకుడు ఉత్సాహవంతుడు అన్ని వర్గాలను కలుపుకునే పోయే మనస్తత్వం ఉన్న యువ నాయకుడు అంటే మోహన్ కే షాద్ నగర్ మున్సిపాలిటీ చైర్మన్ అవకాశం కల్పించలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఎస్సీ వర్గీకరణ జరిగితేనే ఎస్సీలోని అన్ని వర్గాల వారికి రాజకీయంగా అనేక అవకాశాలు దొరుకుతాయని అనేక సందర్భాలలో ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపి అనేక సహాయ సహకారాలు అందించిన అందే మోహన్ కి షాద్ నగర్ మున్సిపాలిటీ చైర్మన్ అవకాశాన్ని కల్పించగలరని షాద్ నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యేకి మరియు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

## గొప్ప మనసు చాటుకున్న సమీర్ పటేల్

### కులమాతలకు అతీతంగా శివాలయానికి సీసీ కెమెరా ఏర్పాటు



**వార్త పత్రిక షాద్ నగర్ ఫిబ్రవరి15:** కులమాతలకు అతీతంగా గొప్ప మనసు తో గ్రామ శివాలయం లో సీసీ కెమెరా ఏర్పాటు చేశారు కాంగ్రెస్ సీనియర్ నాయకులు గులాం సమీర్ పటేల్. అల్వాల గ్రామపంచాయతీలో శివాలయ ప్రాంగణంలో మహాశివరాత్రి సందర్భంగా కుల మతాలకు అతీతంగా శివాలయం గుడి దగ్గర సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సంద ర్భంగా శివాలయానికి సీసీ కెమెరా ఏర్పాటు చేసినందుకు అల్వాల గ్రామ ప్రజలు గులాం సమీ ర్ పటేల్ ను కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆల్వాల్ గ్రామ డిప్యూటీ సర్పంచ్ తిరు మల రెడ్డి, మల్లేష్, మద్దూరి కృష్ణ, చాకలి శ్రీశైలం, మంగలి శివ, సూరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# చెరువును మింగేస్తున్న మురుగు

- మధ్యలోనే ఆగిపోయిన డ్రైనేజీ పనులు
- పర్యావరణం, ప్రజారోగ్యానికి పెను ప్రమాదం
- చెరువులోకి నేరుగా చేరుతున్న మురుగునీరు
- విపరీతంగా పెరిగిన గుర్రపుడెక్క
- దోమల బెడదతో డెంగ్యూ ముప్పు





**వార్తపత్రిక, కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 15:** ఒకవైపు నగరాన్ని హరితవనాలుగా మార్చాలని ప్రభుత్వాలు ప్రకటనలు చేస్తుంటే, మరోవైపు ప్రగతినగర్ చెరువు మురుగునీటిలో మునిగిపోతోంది. చెరువును కాలుష్యం నుంచి రక్షించాల్సిన డ్రైనేజీ డైవర్షన్ పైప్ లైన్ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో మురుగునీరు నేరుగా చెరువులోకి చేరుతోంది. దీనివల్ల పర్యావరణ సమతు ల్యత దెబ్బతిని, వేలాది మంది ఆరోగ్యాలపై ముప్పు పొంచి ఉం దని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రగతినగర్ పరిధిలో ఉన్న ప్రగతినగర్ చెరువు (అంబీర్ చెరువు)ను కాపాడేందుకు గతంలో చేపట్టిన డ్రైనేజీ డైవర్షన్ పైప్‌లైన్ ప్రాజెక్టు నేడు నిర్లక్ష్యానికి ప్రతీకగా మారింది. కాలనీల నుంచి వచ్చే మురుగునీరు చెరువులో కలవకుండా మళ్లించాల్సిన ఈ కీలక పనులు నెలల తరబడి నిలిచిపోవడంతో చెరువు నేరుగా మురుగు నీటి కూపంగా మారుతోంది. పనులు పూర్తికాకపో వడంతో చెరువులో గుర్రపుడెక్క విపరీతంగా పెరిగి, నీటి నిల్వ సామ ర్థ్యం క్రమంగా తగ్గిపోతోంది. ఒకప్పుడు ప్రాంతానికి జీవనాధారంగా నిలిచిన చెరువు నేడు తన ఉనికినే కోల్పోయే పరిస్థితికి చేరుకుందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు.

మరోవైపు చెరువులో నిలిచిపోయిన మురుగునీటి కారణంగా ప్రగతినగర్‌తో పాటు పరిసర కాలనీల్లో దోమల బెడద భరించలేనంతగా పెరిగింది. డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు, వృద్ధులు తీవ్ర అనారోగ్యానికి గురయ్యే అవకాశముందని స్థానికులు ఆందోళన చెందు తున్నారు. డ్రైనేజీ పైప్‌లైన్ పనుల కోసం తవ్విన రోడ్లను అలాగే వదిలేయడం వల్ల రవాణా వ్యవస్థ అస్తవ్యస్తమైంది. రోడ్ల విస్తరణ ఆగిపోవడంతో పాటు ప్రమాదాలు పెరుగుతున్నాయని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రెండు నెలల క్రితం ఇరిగేషన్ అధికారులు సమావేశం ఏర్పాటు చేసి స్థానిక నాయకులతో చర్చలు నిర్వహించినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన నిర్ణయాలు తీసుకోకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. పనులు ఎందుకు ఆగిపోయాయనే విషయంపై నిధుల కొరతా కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా అన్న ప్రశ్నలు ప్రజల్లో వినిపిస్తున్నాయి. ఈ అంశంపై తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు నగేష్ ముదిరాజ్ స్పందిస్తూ, వర్షాకాలం ప్రారంభమయ్యేలోగా పనులు పూర్తి చేయకపోతే పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని హెచ్చరించారు. తక్షణమే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ స్వయంగా రంగంలోకి దిగి, నిలిచిపోయిన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రగతినగర్ చెరువును కాపాడటం అంటే కేవలం ఒక జలాశ యాన్ని రక్షించడం కాదని, వేలాది కుటుంబాల ఆరోగ్యాన్ని, నగర భవిష్యత్తును కాపాడటమేనని ఆయన స్పష్టం చేశారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**వార్తాపత్రిక గండిపేట్:** లేఖలో ఈ విధంగా పేర్కొన్నారు గౌరవనీయులైన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిఏ. రేవంత్ రెడ్డి గారికితెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంహైదరాబాద్. విషయం: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ను మూడు భాగా లుగా విభజించడంలో హేతుబద్ధత లేకపోవడం, ప్రజా ప్రతినిధులతో సంప్రదింపులు లేకుండా తీసుకున్న ఏకపక్ష నిర్ణయంపై తీవ్ర అభ్యంతరం తెలియజేయుట గురించి.

నమస్కారములతో, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని మూడు వేర్వేరు మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పరిశీలించినప్పుడు, ఈ నిర్ణయం స్పష్టమైన హేతుబద్ధత లేకుండా, ఏ విధమైన ప్రాతిపదికను వెల్లడించకుండా, ప్రజాస్వామ్య సంప్రదాయాలకు విరుద్ధంగా తీసుకున్నదిగా స్పష్టమవుతోంది. ఇంత కీలకమైన పరిపాలనా మార్పును గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని స్థానిక ప్రజాప్రతినిధులతో ఎలాంటి సంప్రదింపులు జరపకుండానే ఏకపక్షంగా ప్రకటించడం తీవ్రంగా ఖండనీయమైన విషయం.

రాజేంద్రనగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజ కవర్గా లలోని పట్టణ ప్రాంతాలను రెండు వేర్వేరు కార్పొరేషన్లలో చేర్చడం వెనుక ప్రభుత్వ ఉద్దేశ్యం ఏమిటో స్పష్టత లేదు. సైబరా బాద్ కార్పొరేషన్‌కు అత్యంత సమీపంలో ఉన్న బండ్లగూడ, రాజేంద్రనగర్, శంషాబాద్ వంటి ప్రాంతాలను +ఎవీజ పరిధిలో చేర్చడం ఎందుకు జరిగింది అలాగే మల్కాజిగిరి కార్పొరేషన్‌కు పక్కనే ఉన్న బడంగ్‌పేట్, తుక్కుగూడ, మీర్‌పేట్ ప్రాంతాలను పరిధిలో ఉంచడం వెనుక ఉన్న హేతుబద్ధత ఏమిటి ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని తుర్కయంజాల్ ప్రాంతాన్ని మల్కాజిగిరిలో చేర్చకుండా +ఎవీజలో కలపడం ఏ విధమైన ప్రమాణాల ఆధారంగా జరిగింది ఈ విభజనలో భౌగోళిక, పరిపాలనా, జనాభా ప్రమాణాలను ఏమైనా పరిగణనలోకి తీసుకున్నారా లేక పూర్తిగా ఇష్టానుసార నిర్ణయాలేనా అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ను మూడు భాగాలుగా విభజించాలంటే సమతుల్యంగా, న్యాయంగా విభజిం చాల్సిన అవసరం ఉంది. అయితే, కొత్త 150 డివిజన్లు, సైబరా బాద్ కార్పొరేషన్‌లో 76 డివిజన్లు, మల్కాజిగిరి కార్పొరేషన్‌లో 74 డివిజన్లు ఉండటం ద్వారా ఈ విభజన ఎంత అసమ తుల్యంగా ఉందో స్పష్టంగా తెలుస్తోంది. ఈ అసమాన విభజన వెనుక రాజకీయ అంతర్మం ఏదైనా ఉందా అనే అనుమానాలు సహజంగానే తలెత్తుతున్నాయి. రంగారెడ్డి జిల్లా పరిపాలనా స్థిరత్వం దెబ్బతింటోందని ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో శివారు మున్సిపాలిటీలు, గ్రామపం చాయతీలను విలీనం చేస్తూ తీసుకున్న నిర్ణయాల వల్ల ప్రజలు ఇప్పటికే అనేక మార్పులకు లోనయ్యారు. ఇప్పుడు తిరిగి వాటిని విడదీయడం ద్వారా ప్రజల్లో తీవ్ర గందరగోళం, అయోమయం ఏర్పడుతోంది. ఇది అనాలోచిత నిర్ణయమే కాకుండా, ప్రజలపై అనవసరమైన పరిపాలనా భారాన్ని మోపే చర్యగా మారుతోంది. అంతేకాక, గత శాసనసభ సమావేశంలో శివారు మున్సిపా లిటీలను విలీనం చేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని సంబంధిత మంత్రులు నిండు సభలో స్పష్టంగా ప్రకటించారు. అలాంటి హామీలను విస్మరించి, ఇప్పుడు పూర్తి విరుద్ధ నిర్ణయం తీసుకో వడం శాసనసభకు, ప్రజాస్వామ్య వ్యవస్థకు భంగం కలిగించే చర్యగా భావించాల్సి వస్తోంది. సమావేశంలో శాసనసభ నియోజ కవర్గాల పరిధిలోనే డివిజన్ల విభజన ఉంటుందని అధికారులు స్పష్టం చేసినప్పటికీ, ఆ హామీలకు విరుద్ధంగా రెండు నియోజకవర్గాల ప్రాంతాలను కలుపుతూ డివిజన్ల ఏర్పాటు చేయడం వెనుక ఉన్న హేతుబద్ధత అర్థం కావడం లేదు. సమావేశాల్లో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అభ్యంతరాలు, సూచనలు పూర్తిగా విస్మరించి ప్రభుత్వం ఇష్టారాజ్యంగా ఈ విభజన నిర్ణయం తీసుకోవడం తీవ్ర అభ్యంతరకరమైన విష యం. కావున, ఈ విభజన నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే పునః పరిశీలించాలి. స్పష్టమైన ప్రమాణాలు, హేతుబద్ధతతో కూ డిన, సమతుల్యమైన విభజన మాత్రమే చేపట్టాలని ప్రజల తర ఫున బలంగా డిమాండ్ చేస్తున్నాను. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలపై పరిపాలనా భారాన్ని మోపే నిర్ణయాలను విరమి ంచు కొని, ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు సాగుతుందని ఆశిస్తున్నాను.

# ఘనంగా సేవాలాల్ 287వ జయంతి వేడుక

**అభినయక్ తేజావత్ (ఆలు)**



**నమస్తే భారత్ :-మరిపెడ :** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం వాల్యతండా గ్రామపంచాయతీ లో సంత్ శ్రీ సేవాలాల్ 287వ జయంతి ఘనంగా జరుపకోవడం జరిగింది ఈ కార్యక్రమం లో తేజావత్ అభినయక్ (ఆలు ) మాట్లాడుతూ మనతండాలో ఈరోజు కలిసికట్టుగా ఉండి సమాజంలో మనకంటూ ఒక ప్రత్యేక గుర్తుంపు పొందినం అంటే మన పూర్వికులు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ చూపిన సత్ మార్గం ఏక్ -జాత్-ఏక్-వాత్-ఏక్-సాత్ అనే నినాదం తో గోరుర్ విశ్వాగురు శ్రీ సేవాలాల్ జయంతి సందర్భంగా ముందుగా భోగ్ బండార్ కార్యక్రమం చేసి వారి మార్గం లో నడవాలని కోరారు. గ్రామపంచాయతీ సర్పంచ్ నాగనాయక్ మరియు వారి పాలకవర్గం, తేజావత్ బాలాజీ సహకారం తో కార్యక్రమం లో పాల్గొన్నవారు ఉపసర్పంచ్ సపవట్ టాక్రియ, మాజీసర్పంచ్ శంకర్, మాజీ ఉపసర్పంచ్ హాతిరం, తండా నాయకులు తేజవత్ పెదవేంకన్న, సపవట్ సోమన్న, తేజవత్ భాస్కర్, బాలు, మాలు, నంద్యా, శంకర్, వీరన్న, భూక్యా కీమా, తేజవత్ హాతిరం, వీరన్న, అంగోత్ తవుర్య, తేజవత్ రవి, మరియు యూత్ పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# సంతు సేవాలాల్ మహారాజ్ 287 జయంతి





**వార్తాపత్రిక గండిపేట్:** కిస్మత్‌పూర్ డివిజన్‌లోని ఎర్రకుంట తండాలో ఘనంగా నిర్వహిస్తున్న బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకల్లో బిజెపి రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీ తోకల శ్రీనివాస్ రెడ్డి తో కలిసి పాల్గొన్న కిస్మత్ పూర్ మాజీ ఉపసర్పంచ్ రంగారెడ్డి జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు నిరుడు శేఖర్ ముదిరాజ్,

ఈ సందర్భంగా సంత్ సేవలాల్ మహారాజ్ గారి సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సంకల్పించారు. బంజారా సమాజ అభివృద్ధికి మా సంపూర్ణ మద్దతు ఎల్లప్పుడూ ఉంటు ందని హామీ ఇచ్చారు, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన బంజారా నిర్వాహక కమిటీ సభ్యులను అభినందనలు తెలియ జేశారు, ఈ కార్యక్రమంలో బంజారా నాయ ుకులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# టేకులపల్లిలో మిన్నంటిన సేవాలాల్ జయంతి వేడుకలు గిరిజన ఆరాధ్య దైవం,అహింసా మూర్తి సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఘనంగా నిర్వహణ







**వార్తాపత్రిక:టేకులపల్లి,ఫిబ్రవరి15 :**మండల కేంద్రంలో ఆధ్యాత్మిక చైతన్యం వెల్లివిరిసింది. బంజారాల ఆరాధ్య దైవం, సమాజ సంస్కర్త,అహింసా మూర్తి శ్రీ సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు టేకులపల్లి మండల వ్యాప్తంగా అత్యంత వైభవంగా,పండుగ వాతావరణంలో జరిగాయి. 'సేవా.. భాయా..' నినాదాలతో తండాలు,పల్లెలు మారుమోగాయి. చరిత్ర పుటల్లో మహనీయుడు సేవాలాల్ మహారాజ్ ప్రస్థానం ఈ సందర్భంగా సేవాలాల్ మహారాజ్ చరిత్రను స్మరించుకున్నారు. 1739 ఫిబ్రవరి 15న అనంతపురం జిల్లా గూటి సమీపంలోని 'చెల్వగూడ' (ప్రస్తుత సేవాలాల్ గఢ్)లో భీమా నాయక్,ధర్మణి యాడి దంపతులకు జన్మించిన సేవాలాల్ మహారాజ్,గిరిజన సమాజానికి దిక్సూచిగా నిలిచారు. బంజారాల బాంధవుడు అడవి బిడ్డలైన బంజారాలను అజ్ఞానం నుండి విముక్తులను చేసి,వారిని విద్యావంతులుగా,సంస్కారవంతులుగా తీర్చిదిద్దారు. సమాజ సంస్కర్త మూఢనమ్మకాలను పారద్రోలడం,మద్యపాన నిషేధం,జంతు బలుల నివారణ వంటి గొప్ప సంస్కరణలు చేపట్టారు."జీవహింస మహా పాపం"అని బోధిస్తూ, ప్రకృతిని ప్రేమిస్తూ జీవించాలని ఆయన ఇచ్చిన 22 సూత్రాలు నేటికీ గిరిజన సమాజానికి వేదప్రమాణాలు. బ్రిటిష్ పాలకుల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడి,గిరిజన సంస్కృతిని కాపాడిన గొప్ప యోధుడు ఆయన. సేవా ఘడ్‌లో భక్తి పారవశ్యం-హోరెత్తిన భారీ ర్యాలీ స్థానిక మండల కేంద్రంలోని సేవా ఘడ్ ఆలయంలో ఉదయం నుంచే భక్తుల రద్దీ నెలకొంది. సేవాలాల్ మహారాజ్ విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు,పూజలు నిర్వహించారు. అనంతరం సేవాలాల్ సేన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సేవా ఘడ్ నుండి బోడు క్రాస్ రోడ్ వరకు వందలాది బైక్‌లపై యువత సేవాలాల్ జెండాలను చేతబూని,గిరిజన సంస్కృతిని చాటిచెప్పేలా నినాదాలు చేస్తూ ముందుకు సాగారు.
మహా బోగ్ బండారో మరియు అన్నదాన వితరణ ర్యాలీ అనంతరం సేవాలాల్ మహారాజ్‌కు అత్యంత పవిత్రమైన'మహా బోగ్ బండారో'(నైవేద్యం)కార్యక్రమాన్నిభక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నంతరం ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. మండల ంలోని దంతెల తండా,కొత్త తండా వంటి గ్రామాల్లో సైతం జయంతి వేడుకలు మిన్నంటాయి. పాల్గొన్న ప్రముఖులు ఈ ఉత్సవాల్లో పలువురు నాయకులు పాల్గొని సేవాలాల్ మహారాజ్ ఆశయాలను స్మరించుకున్నారు. పాల్గొన్న వారిలోప్రముఖులు భూక్యా గన్న నాయక్, ప్రేమ్ చంద్ నాయక్. సర్పంచ్‌లు టేకులపల్లి సర్పంచ్ బోడ బాలు నాయక్,పూల్ బంతి సర్పంచ్,లక్ష్మ నాయక్, రామా నాయక్. ముఖ్య నేతలు దళ సింగ్ నాయక్, కోరం ఉమ,దారావత్ సురేష్, భూక్యా లాలు నాయక్,భూక్యా కిషోర్ సింగ్,హుస్సేన్ నాయక్, బోడ పుణ్య నాయక్ తదితర నాయకులు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సేవాలాల్ మహారాజ్ చూపిన అహింస, శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని,గిరిజన సంస్కృతిని కాపాడుకోవాలని ఈ సందర్భంగా వక్తలు పిలుపునిచ్చారు.

# ఘనంగా సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు

- భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించిన స్వచ్ఛంద సంస్థ మరియు ఆలయ కమిటీ
- తండాల్లో మిన్నంటిన ఆధ్యాత్మిక చైతన్యం..భారీగా తరలివచ్చిన భక్తులు





**వార్తాపత్రిక:టేకులపల్లి,ఫిబ్రవరి 15 :**ఆధ్యాత్మిక గురువు,గిరిజన బాంధవుడు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలు ఆదివారం రోజున గోలియా తండ గ్రామపంచాయతీలో అత్యంత వైభవంగా జరిగాయి. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ వేడుకల్లో భక్తులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సేవాలాల్ మహారాజ్‌కు ఘన నివాళులర్పించారు. సేవాలాల్ ఆశయాలను స్మరిస్తూ.. ఈ కార్యక్రమానికి సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ ఇస్లావత్ నామా నాయక్ మరియు సేవాలాల్ టెంపుల్ చైర్మన్ ఇస్లావత్ సాయి నాయకత్వం వహించారు. ఈ సందర్భ గా వారు మాట్లాడుతూ.. సేవాలాల్ మహారాజ్ చూపిన అహింస, సత్యం మరియు జీవకారుణ్యం అనే మార్గాలు నేటి సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. గిరిజన తండాల అభివృద్ధి,విద్యావంతులైన యువత ఆవిర్భావమే మహారాజ్ ఆశయమని,వాటి సాధన కోసం తమ సంస్థ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ప్రముఖుల సమక్షంలో వేడుకలు.. ఈ ఉత్సవాల్లో గోలియా తండా సర్పంచ్ నాకా నాయక్ మరియు ప్రముఖ నాయకులు లక్కినేని సురేందర్ రావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. సేవాలాల్ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం,గిరిజన సంప్రదాయం ప్రకారం జరిగిన భోగ్ బండార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాల్గొన్న ముఖ్య నేతలు ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్తలు,సామాజిక కార్యకర్తలు మరియు భూక్యా కస్నా నాయక్,మోతిలాల్ నాయక్,మూడ్ సంజయ్ ,బానోతు శంకర్,భూక్యా శంకర్ నాయక్,ఇస్లావత్ వినోద్, బానోతు రవి మరియు ఇతర తండా వాసులు,యువజన సంఘాల ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు,గిరిజన యువతీ యువకుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమం ముగింపులో భక్తులందరికీ భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకతో గ్రామమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

# టేకులపల్లిలో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు





**వార్తాపత్రిక:టేకులపల్లి,ఫిబ్రవరి15 :** శివ నామస్మరణతో టేకులపల్లి మండలంలోని టేకులపల్లి శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయంలో సోమలింగేశ్వర స్వామి,కొండగులబోడు గుట్టపై వెలిసిన వీరభద్ర స్వామి భద్రకాళి ఆలయం,గంగారం పంచాయతీ సిద్ధారం నందులగుట్ట అడవిలో వెలిసిన సోమలింగేశ్వర స్వామి,కొప్పురాయిలోని శ్రీస్వర్ణ లింగేశ్వర మల్లన్న స్వామి దేవాలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవలను ఆయా ఆలయ కమిటీ నిర్వాహకులు,మండల ప్రజలు మహా శివరాత్రి వేడుకలను ఘనంగా జరుపు కున్నారు. టేకులపల్లి మండల కేంద్రంలోని శ్రీ భవాని శంకర స్వామి సహిత శ్రీ గోవింద మాంబా సమేత పోతులూరి వీరబ్ర హ్మేంద్రస్వామి వారి దేవాలయం,పలు ఆలయాల్లో ఆదివారం మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా తెల్లవారుజాము నుంచి రుద్రాభిషేకములు,వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం,రాత్రి శివపార్వతుల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. శివాలయాలలో ఉదయం నుంచే భక్తులతో కిటకిటలా డాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాల ఎదుట భక్తులు బారులు తీరి స్వామివారిని దర్శించుకుని పునీతుల య్యారు. టేకులపల్లి మండల కేంద్రంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ కమిటీ అధ్యక్షులు తౌడోజు బిక్షమయ్య,ప్రధాన కార్యదర్శి నోముల భాస్కరాచారి, ధర్మపురి శ్రీనివాసచారి,కటుకోజ్వాల సురేష్,ఉరిమెళ్ళ యాదా చారి,చంద్రగిరి రాధాకృష్ణ,బౌరోజు బిక్షమయ్య,చిలకమర్రి రామ కృష్ణ,నోముల భానుచందర్,పర్వతం ఉపేంద్రచారి, గజ్జెల రామ్మోహనచారి,గుంతోజు కృష్ణ ,తౌడోజు వెంకన్న,వజ్రాల బ్రహ్మయ్య, గద్దోజు రమేష్,జూకంటి
విరాచారి,తౌడోజు మణికంఠ,టేకులపల్లి బ్రహ్మం గారి దేవాలయ అర్చనలు మంతోజు
పవన్ కుమార్ పాల్గొన్నారు.

# సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

- మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్
- ఇన్ముల్ నర్వ గ్రామంలో సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజన్న, బీఆర్ఎస్ శ్రేణులు






**వార్త పత్రిక షాద్ నగర్ ఫిబ్రవరి15:**కొత్తూర్ మండలం ఇన్ముల్ నర్వ గ్రామంలో సేవాలాల్ జయంతి సందర్భంగా నిర్వహించిన పూజ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహారాజ్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆయన బోధనలు సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులతో గ్రామంలో శాంతి, ఐక్యత, అభివృద్ధి కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్య్ర కమంలో గ్రామ సర్పంచ్ లలిత గోపాల్ నాయక్, మేకగూడ సర్పంచ్ రాజు నాయక్, మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, పెంటనోళ్ళ యాదగిరి, జంగయ్య, ఆలయ చైర్మన్ కొర్ర హనుమంతు, నాయకులు సతీష్ గుప్తా, రవి, మల్లేష్, ఇంద్రసేనా రెడ్డి, గోపాల్, కోట్యా నాయక్, శ్రీశైలం యాదవ్, వెంకట్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# శివరాత్రి వేడుకల్లో పాల్గొన్న శ్రీశైలం గౌడ్



**వార్తపత్రిక, కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 15:**శివరాత్రి పర్వదిన సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ఆలయ కమిటీల ఆహ్వానం మేరకు స్థానిక మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ శివాలయాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పరమశివుడికి ప్రత్యేక పూజలు చేసి స్వామివారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరమశివుడి అనుగ్రహంతో ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని, చీకటిని తొలగించి అందరి జీవితాల్లో కాంతులు నింపాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలందరికీ శివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.
అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సేవాలాల్,ఉత్సవాల్లో,పాల్గొన్న ,బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి



**వార్త పత్రిక నారాయణపేట జిల్లా :**మరికల్ మండలం బుధ్యగానీ తాండాలో జరిగిన శ్రీ శ్రీ శ్రీ సద్గురు సేవాలాల్ గారి జయంతి సందర్భముగా సేవాలాల్ ఉత్సవాల్లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి గారు,పాండు నాయక్ గారు,బాబా నాయక్ గారు,రాజు నాయక్ పాల్గొన్నారు

# షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ పదవి అందే మోహన్‌కే ఇవ్వాలి

- పసుపుల ప్రశాంత్ డిమాండ్
- చైర్మన్ ఇవ్వకపోతే వచ్చే సారి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దింపుతాం



**వార్త పత్రిక షాద్ నగర్ ఫిబ్రవరి15:**షాద్‌నగర్ పట్టణంలో పార్టీ అభివృద్ధి కోసం, ఎమ్మెల్యే గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన అందే మోహన్ కి మున్సిపల్ చైర్మన్ పదవి ఇవ్వాలని ముదిరాజ్ బిడ్డగా పసుపుల ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో తన సొంత కుటుంబంలోనే బీజేపీ నాయకుడు అందే బాబ న్నకి టికెట్ వచ్చినా, వ్యక్తిగత అంశాలు పక్కనబెట్టి పార్టీ ఐక్యత కోసం, వీర్లపల్లి శంకర్ విజయానికి అందే మోహన్ విశేషంగా శ్రమిం చారని తెలిపారు. పార్టీకి అంకితభావంతో పనిచేసిన నాయకుడికి గౌరవం ఇవ్వడం అవసరమని, మున్సిపల్ చైర్మన్ పదవిని అందే మోహన్ కే కేటాయించాలని ఆయన స్పష్టం చేశారు. పార్టీ అధిష్ఠానం ఈ డిమాండ్‌ను పరిగణలోకి తీసుకోకపోతే, వచ్చే ఎన్నికల్లో అందే మోహన్ ని ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దింపేందుకు సిద్ధంగా ఉంటామని పసుపుల ప్రశాంత్ హెచ్చరించారు. షాద్‌నగర్ ప్రజల మనోభావాలను గౌరవిస్తూ సరైన నిర్ణయం తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# వీరభద్ర స్వామిని దర్శించుకున్న తోకల శ్రీనివాస్



**వార్తాపత్రిక గండిపేట్:** పవిత్ర మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మంచిరేవులలోని వీరభద్ర స్వామి దేవాలయంలో రాజేంద్రనగర్ బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారుఈ సందర్భంగా స్వామివారి ఆశీస్సులు రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలందరికి సుఖసంతోషాలు, ఆయు- ఆరోగ్యం ప్రసాదించాలని మొక్కు కున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ, కిస్మత్పూర్, హైదర్ షాకోట్, రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అక్షర సైన్యం కదలాలి.. పుస్తక పఠనం పెరగాలి: 17న 'పుస్తక ప్రియుల పాదయాత్ర'


- టేకులపల్లి శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం
- పాల్గొనాలని కోరిన గ్రంథపాలకుడు ఆర్. నాగన్న




**వార్తాపత్రిక:టేకులపల్లి,ఫిబ్రవరి15** :పుస్తక పఠనం ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని,జ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలే సరైన వేదికలని టేకులపల్లి శాఖ గ్రంథపాలకుడు ఆర్.నాగన్న అన్నారు.ఈ నెల 17వ తేదీన స్థానిక శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో పట్టణంలో భారీ "పుస్తక ప్రియుల పాదయాత్ర" నిర్వహిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.
ఈ పాదయాత్ర 17వ తేదీన ఉదయం 10:00గంటలకు స్థానిక ఎమ్మార్వో కార్యాలయం నుండి ప్రారంభమవుతుంది.అక్కడి నుండి పట్టణ పురవీధుల గుండా సాగుతూ బోడు సెంటర్ వరకు ఈ ర్యాలీ కొనసాగుతుందని ఆయన వివరించారు.అందరికీ ఆహ్వానం నేటి డిజిటల్ యుగంలో పుస్తక పఠనం తగ్గుతున్న నేపథ్యంలో,విద్యార్థులకు మరియు యువతకు పుస్తకాలపై మక్కువ పెంచడమే ఈ యాత్ర ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో టేకులపల్లి మండల స్థాయి అధికారులు,ప్రజాప్రతినిధులు,విద్యార్థులు,ఉపాధ్యాయులు,మేధావులు మరియు పుస్తక ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాగన్న పిలుపునిచ్చారు

# 10వ వార్డు మరియు11వ వార్డు కౌన్సిలర్లు బాదావతి బేబి రవి మరియు లావుడ్య సత్యవతి యుగేంధర్

- గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు.వారిని.శాలువాతో.సన్మానించి,అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు



**వార్త ప్రతిక:-మరిపెడ** :మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు ని మర్యాదపూర్వకంగా కలిసిన,మరిపెడ.మున్సిపాలిటీలోని గెలుపొందిన 10వ వార్డు మరియు11వ వార్డు కౌన్సిలర్లు బాదావతి బేబి రవి మరియు లావుడ్య సత్యవతి యుగేంధర్ ఈ సందర్భంగా నవీన్ రావు వారిని.శాలువాతో.సన్మానించి,అభినందన శుభాకాంక్షలు తెలియజేశారుఅలాగే వారి గెలుపుకోసం రాత్రింబవళ్ళు కష్ట పడిన.నాయకులను,యువకులను, మహి ళలను, కార్యకర్తలను శాలువతో సన్మానించి, అభినందించారు.వారి వెంట మాజీ కౌన్సిలర్ ఎడెల్లి పరుశురాములు వార్డు ఇంచార్జ్ మంద వెంకన్న ,ఎడెల్లి సైదులు, భాషిపంగు సురేష్, ఎడెల్లి ఉప్పలయ్య, ఎడెల్లి ఇద్దయ్య, భాషిపంగు సునీల్, భాషిపంగు ఉప్పలమల్లు, పుల్లూరి ఉమా,బాషిపంగు శైలజ గోల్కొండ వెంకన్న, దరువు వెంకట్,పట్ల వంశీ,చిదుముల సంతోష్ తదితరులు పాల్గొన్నారు

# శివపార్వతుల కల్యాణానికి పుస్తె మెట్టల అందజేత



**వార్తప్రతిక:-మరిపెడ** :శివపార్వతుల కల్యాణానికి పుస్తె మెట్టల అందజేత తాళ్ల ఊకల్ ఉమామహేశ్వర ఆలయంలో వైభవంగ.కళ్యాణం.మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని తాళ్లఊకల్.గ్రామంలోని.ఉమామహేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అర్చకుల వేద మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ఈ కళ్యాణాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో తిలకించారు. ఈ సందర్భంగా మరిపెడకు చెందిన లక్ష్మీ సరస్వతి జ్యువెలరీ యజమానులు తాడూరి రమేష్-సరస్వతి దంపతులు స్వామివారి కళ్యాణానికి పుస్తె మెట్టలు సొంత ఖర్చులతో సమర్పించారు. ఈ దంపతులు స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తప్పెట్ల శ్రీను, ఉప సర్పంచ్ బోర మల్లయ్య, భూక్య కాల్య నాయక్, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కళ్యాణ మహోత్సవంతో గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది.

# ప్రజాస్వామ్య రక్షణతోనే రాజ్యాంగ రక్షణ

ఐ ఎల్ పి ఎ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్






**వార్తాపత్రిక:: హనుమకొండ** : అణగారిన పీడిత ప్రజలు ఐక్యమై ప్రజాస్వామ్యాన్ని రక్షించుకున్నపుడే రాజ్యాంగం రక్షించబడ ంతుందని ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్ అన్నారు. భారత నాస్తిక సమాజం 54వ వ్యవస్థాపక దినోత్సవం, భా.నా స వ్యవస్థాపకులు డాక్టర్ జయగోపాల్ రెండవ వర్ధంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం జిల్లా కేంద్ర పౌర గ్రంథాలయంలో రాజ్యాంగం ప్రస్తుత పరిస్థితులు అనే అంశంపై భా.నా.స జాతీయ సమన్వయకర్త జె రవి అధ్యక్షతన ఆదివారం జరిగిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. వేల సంవత్సరాలుగా భారతదేశంలోని మెజార్టీ ప్రజలను కులం, అంటరానితనం పేరుతో అణచివేసారని, బ్రాహ్మణీయ ఆధిపత్య పాలకులు మనుధర్మ శాస్త్రం పేరుతో దేశ మూలవాసి ప్రజలను విద్యకు, ఆస్తికి, అధికారానికి దూరం చేశారని, దేశంలో సగభాగమైన మహిళలను సైతం శూద్రుల లాగానే అణచివేశారని ఆ అణిచివేత కారణమైన మనుధర్మ శాస్త్రాన్ని 1927లో తగలబెట్టిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్వాతంత్రానంతరం సమానత్వం, సౌభ్రాతృత్వంతో కూడిన రాజ్యాంగాన్ని అందించారని, ఎస్సీ ఎస్టీలకు విద్యా ఉద్యోగాలతో పాటు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించారని అన్నారు. రాజ్యాంగం మెజార్టీ ప్రజలకు వ్యతిరేకంగా ఉందని పెరియార్ రాజ్యాంగాన్ని తగలబెట్టారని, స్వాతంత్రం వచ్చిన సందర్భంలో కూడా వెండి సంకెళ్లు పోయి బంగారు సంఖ్యల్లో పడ్డాయని పెరియార్ అన్నారు. పీడిత ప్రజల విముక్తి కోసం రాజ్యాంగంలో ఎన్ని హక్కులు పొందుపరిచినప్పటికీ ఆ రాజ్యాంగ అమలు దోపిడీ పాలకుల చేతిలో ఉండడం వల్ల రాజ్యాంగాన్ని వారికి అనుకూలంగా సవరణలు చేసుకుంటూ ప్రజల్ని మరింత అణిచివేస్తున్నారని, ప్రజాస్వామ్య రక్షణతోనే రాజ్యాంగ రక్షణ జరుగుతుందని ప్రజాస్వామ్య రక్షణ జరగాలంటే నైతిక విలువలు కలిగిన జయగోపాల్, పెరియార్ లాంటివాళ్ళు చట్టసభల్లోకి వెళ్లాలని మెజార్టీ ప్రజలైన ఓబీసీలు చట్టసభల బయట ఉండడం వల్ల ఎస్సీ, ఎస్టి ప్రజా ప్రతినిధులు చట్టసభల్లో ఆధిపత్య దోపిడి కులాల పార్టీలకు బానిసలుగా బతకాల్సి వస్తుందని అన్నారు. ఇంటింటికి రాజ్యాంగ చేర్చడం ద్వారానే ప్రజల్ని చైతన్య పరచి విలువల సమాజాన్ని నిర్మితం చేయొచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైటర్స్ అకాడమీ చైర్మన్, లీడర్ పత్రిక ఎడిటర్ వి.వి. రమణమూర్తి సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ 2026 క్యాలెండర్ ను ఆవిష్కరించి మాట్లాడారు. బా.నా.స వ్యవస్థాపకులు డాక్టర్ జయగోపాల్ పెరియార్ సిద్ధాంత బాటలో జీవితాన్ని త్యాగం చేసి ఎన్నో ఉద్యమాలు చేయడమే కాకుండా కుటుంబాన్ని మొత్తం పెరియార్ సిద్ధాంత ఉద్యమంలో భాగస్వాములను చేయడం గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వేదాంత మౌర్య మాట్లాడుతూ బాల్య దశ నుండే విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం అలవరచడకోసం




సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ను ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యం చేసిన ఘనత జయగోపాల్ కు దక్కుతుందని అన్నారు. సిపిఐ ఆంధ్ర రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జె వి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపర్చినట్లుగా సమానత్వం అనేది బూటకంగా మారిందని, దేశంలో ప్రశ్నించే గొంతులను అక్రమ కేసులతో జైళ్లలో పెట్టడం సర్వ సాధారణమైందని అన్నారు. భారత రాజ్యాంగాన్ని వ్యతిరేకించిన శక్తులే నేడు ఆ రాజ్యాంగాన్ని అమలు చేసే స్థానంలో ఉండడం వల్ల వారి ఇష్టానురీతిగా చట్టాలు సవరణ చేయడమే కాకుండా ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని అన్నారు. బ్రిటీష్ కాలం నాటి చట్టాలను సరళతరం చేయాల్సిన పాలకులు చట్టాలను భారత న్యాయ సన్నిహిత పేర్లతో మరింత కఠినతరం చేస్తున్నారని అన్నారు. శ్రామికుల హక్కులు కాలరాసే చట్టాలను తీసుకురావడం కూడా చేస్తున్నారని అన్నారు. జీవరాశులు నివసించే ఖనిజ సంపదలను, సహజ వనరులను ధ్వంసం చేయడం వల్లనే జంతువులు ఊళ్ళ మీద పడుతున్నాయని, ఖనిజ సంపదలు సమృద్ధిగా ఉండే ప్రాంతంలో ఉన్న మావోస్టులను అంతమొందిస్తున్నారని అన్నారు. రాజ్యాంగం ప్రజలకు స్వేచ్ఛను కల్పించినప్పటికీ ఆది మాటలకే పరిమితమైందని అన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ఉండే మీడియా కూడా అధికార పక్షానికి కొమ్ముకాస్తున్న దుస్థితిలో ప్రజాస్వామ్యముందని అన్నారు. పాలకుల దోపిడీని గుర్తించే బాటలో ప్రజలు ముందుకు సాగుతున్నారని అన్నారు. జయగోపాల్ ఆలోచనలను నేటి తరం ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఆయనకిచ్చే నిజమైన నివాళని అన్నారు. భా.నా.స ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామమూర్తి మాట్లాడుతూ భారత నాస్తిక సమాజం అంటే మూఢ నమ్మకాలపైనే పనిచేయడం కాదు. మానవ హక్కులు, పీడిత ప్రజల విముక్తి కోసం పోరాటం చేయడమని అన్నారు. రాజ్యాంగంలో ప్రజల మేలు కోసం, దేశ రక్షణ కోసం, జీవించే హక్కు కోసం ఎన్నో ఆర్టికల్స్ పొందుపరిచారని, ఆదివాసీ ప్రాంతాలను రక్షించడంతో పాటు అడవులను రక్షించడం కోసం రాజ్యాంగంలో పొందుపరచారని, ఎన్నో హక్కులను పొందుపరచిన రాజ్యాంగ మౌలిక సూత్రాలను పాఠ్య పుస్తకాల్లో పొందుపరచాలని డిమాండ్ చేసారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేసినప్పుడే ప్రజల అభివృద్ధి జరుగుతుందని అన్నారు. సెక్యులర్ దేశమని మాట్లాడుతున్నా మత మూఢత్వాలతో పాలన కొనసాగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీమ్ సేన నాయకులు రవి సిద్ధార్థ మాట్లాడుతూ సర్వ సత్తాక గణతంత్ర దేశంగా ప్రకటించుకొని, సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కోసం వ్రాసుకున్న రాజ్యాంగం అమలులో లోపాల వల్ల నష్టం జరుగుతుందని అన్నారు. సెక్యులర్ దేశమంటూనే మతోన్మాదాన్ని పెంచి ప్రజ లను అల్లకల్లోలం చేస్తున్న పాలకుల కుట్రలను అర్థం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు కె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కుల వ్యవస్థ, మనుధర్మం, భారత రాజ్యాంగం పట్ల స్పష్టమైన అవగాహన కలిగిన జయగోపాల్ ప్రజలను చైతన్యం చేసి పోరాటాలకు సమాయత్తం చేయడంలో జీవితాన్నే త్యాగం చేశారని అన్నారు. దేశాన్ని పాలిస్తున్న బిజెపి పాలకులు ఇవిఎం ల ద్వారా దొడ్డి దారిన మూడోసారి అధికారంలోకి వచ్చారని అన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్ల ద్వారా చట్టసభల్లోకి ప్రవేశిస్తున్న ఎస్సీ, ఎస్టీ లు నిస్సాయులుగా ఉన్నారని, ఎస్సీ లకు ప్రత్యేక నియోజకవర్గాల లేనందునే వారు బానిసలుగా కొనసాగుతున్నారని, ఎస్సీ లకు ప్రత్యేక నియోజకవర్గాల కోసం అంబేద్కర్ కృషి చేస్తే గాంధీ అడ్డుకొని నష్టం చేశాడని అన్నారు. రాజ్యాంగం రూపంలో మనుధర్మ శాస్త్రం అమలవుతుందని అన్నారు. రాజ్యాంగ అమలు కోసం, సమానత్వం కోసం ప్రజలను సమాయత్తం చేయాలని అన్నారు. బడా వ్యాపారులు చేసిన లక్షల కోట్ల అప్పులు మాఫీ చేసే పాలకులు చిన్న, సన్నకారు ప్రజలకిచ్చిన రుణాలను ముక్కు పిండి వసూలు చేస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించి, తిరుగుబాటు చేస్తున్న ప్రజలను టార్గెట్ పెట్టి చంపడం ఏ దేశంలో లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చైతన్య మహిళ సంఘం నాయకురాలు డి లలిత మాట్లాడుతూ ప్రజలకు వ్యతిరేకమైన భావజాలాన్ని ప్రజలపై రుద్దుతున్న బిజెపి దాని అనుబంధ విభాగాలను వ్యతిరేకించాలని అన్నారు. కుటుంబాల ఐక్యతతో భావజాల వ్యాప్తితో ముందుకు సాగాలని అన్నారు. భా.నా.స విశాఖ జిల్లా అధ్యక్షులు నూకరాజు మాట్లాడుతూ మూఢనమ్మకాల వల్ల పేద ప్రజలకు జరుగుతున్న నష్టాన్ని ప్రజలకు వివరించడంలో జయగోపాల్ కీలకపాత్ర పోషించారని, పీడిత ప్రజల విముక్తి కోసం త్యాగపూరిత ఉద్యమాలు చేసిన జయగోపాల్ స్ఫూర్తితో మతతత్వ రాజకీయాలను ఎదురించాలని అన్నారు. మనువాద పాలకుల కుట్రలను గమనించాలని, రాజ్యాంగ స్ఫూర్తికి కలుగుతున్న నష్టాన్ని, ప్రజాస్వామ్యానికి కలిగిన ప్రమాదాన్ని గుర్తించాలని అన్నారు. ప్రజాస్వామ్యానికి ప్రమాదం కలిగిస్తున్న పాలకులు హిందూ మతానికి ప్రమాదం కలుగుతుందని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. రాజ్యాంగ ఫలాలు అనుభవిస్తున్న వారు రాజ్యాంగ పరిరక్షణ కోసం, విలువల రాజకీయ స్థాపన కోసం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ దళిత హక్కుల సంఘం నాయకులు బి వెంకట్రావు, బా.నా.స మహిళా విభాగం నాయకురాలు జె శ్యామల, స్వప్న, లలిత, స్వర్ణ, సరళ, లక్ష్మీ, సంతోష్, బి జోగినాయుడు, బోనేల కుమారస్వామి, త్రిలోచనరావు, శ్రీనివాసరావు, న్యాయవాది అప్పారావు, డార్విన్ రాము తదితరులు పాల్గొని మాట్లాడగా బా.నా.స మాజీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ ఎస్ మురళి వందన సమర్పణ చేశారు.

# మున్సిపల్ చైర్మన్ గా బీసీలను నియమించాలి

- మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ రమేష్

**వార్త ప్రతిక :-తొర్రూరు** :తొర్రూరు మున్సిపల్ చైర్మన్ గా బీసీ వర్గానికి చెందిన అభ్యర్థిని నియమించాలని మేధావుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రొఫెసర్ కూరపాటి రమేష్ అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో బీసీ మేధావుల ఫోరం మరియు బిసి,ఎస్సీ,ఎస్టీ, జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొర్రూరు మున్సిపాలిటీ చైర్మన్ పదవి బీసీలకే కేటాయించాలని డిమాండ్ చేశారు.అన్ని రాజకీయ పార్టీలు సామాజిక న్యాయం మరియు సమాన హక్కుల పరిరక్షణ దృష్ట్యా



బీసీ అభ్యర్థికి అవకాశం కల్పించాలని కోరారు.సోమవారం జరగబోయే చైర్మన్ ఎన్నికల్లో బీసీ వర్గానికి చెందిన వ్యక్తిని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని, తెలంగాణ రాష్ట్ర స్థాయిలో బీసీ వర్గాల గౌరవాన్ని కాపాడే విధంగా అన్ని పార్టీలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ రిటైర్డ్ ప్రొఫెసర్ చందా మల్లయ్య, బీసీ మేధావుల ఫోరం వరంగల్ జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ డా. కె. వీరస్వామి,బీసీ మేధావుల వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ మండల పరశురాములు,నేషనల్ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు మెరుగు బాబు యాదవ్, బీసీ నాయకులు కొత్తూరు రమేష్,అన్నపురం వెంకన్న గౌడ్,బూరిశెట్టి అల్ల బాబు,కోదునూరు సదాకర్, కుమారస్వామి,సాదు రాములు, డొఒక ఐలయ్య, పుప్పాల మధు, కుమార్ తదితరులు పాల్గొన్నారు

# శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశయాలును కొనసాగించాలి

- శ్రీ సంత్ సేవలల్ మహారాజ్ నేటి యువతకు ఆదర్శం
- శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్, జగదంబ యాడి చల్లని ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలి
- శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి అధికారికంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలి

**జిల్లెడ్ చౌదరిగూడ మండలం** : వార్త పత్రిక షాద్ నగర్ ఫిబ్రవరి15: శ్రీ సంత్ సేవాలల్ మహారాజ్ 287వ జయంతి సందర్భంగా షాద్నగర్ నియోజకవర్గం జిల్లెడ్ చౌదరిగూడెం మండలంలోని చింతకుంట తండా గ్రామపంచాయతీ వేపకుచ్చ తండాలో, తండా నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా భోగ్ బండారో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. గిరిజన యువ నాయకుడు ఆకాష్ నాయక్ వారు మాట్లాడుతూ
శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ కేవలం బంజారా సమాజానికే పరిమితమైన దైవం కాదు; ఆయన యావత్ భారతదేశానికి, ముఖ్యంగా అణగారిన వర్గాలకు ఒక గొప్ప మార్గదర్శి మరియు ఆదర్శప్రాయుడైన గురువు. 18వ శతాబ్దంలో ఆయన బోధించిన జీవన సూత్రాలు, చేసిన పోరాటాలు నేటికీ సమాజానికి ఎంతో అవసరం.ఆయన కేవలం ఆధ్యాత్మిక గురువు మాత్రమే కాదు, ఒక సామాజిక సంస్కర్త, ప్రకృతి ప్రేమికుడు మరియు గొప్ప యోధుడు.సేవాలాల్ మహారాజ్ చేసిన ముఖ్యమైన పోరాటాలు సేవాలాల్ మహారాజ్ తన జీవిత కాలంలో అనేక రకాల సామాజిక మరియు రాజకీయ సవాళ్లను ఎదుర్కొన్నారు.?బ్రిటిష్ నిరంకుశత్వంపై పోరాటం:18వ శతాబ్దంలో ఈస్ట్ ఇండియా కంపెనీ



భారతీయ అటవీ సంపదను, స్థానిక వ్యాపారాలను దెబ్బతీస్తున్న తరుణంలో ఆయన గళం విప్పారు. బంజారాల జీవనధారమైన లంబాడీ రవాణా వ్యవస్థను దెబ్బతీయాలని చూసిన బ్రిటిష్ వారితో ఆయన రాజీపడకుండా పోరాడారు.నిజాం పాలకులతో ఘర్షణ: అప్పటి హైదరాబాద్ నిజాం పాలనలో జరుగుతున్న అన్యాయాలను, మత మార్పిడులను ఆయన తీవ్రంగా వ్యతిరే కించారు. తన జాతి సంస్కృతిని, స్వధర్మాన్ని కాపాడు కోవడానికి ఆయన అలుపెరగని పోరాటం చేశారు.మూఢనమ్మకాలపై యుద్ధం:సమాజంలో వేళ్లూనుకున్న మూఢనమ్మకాలు, జంతు బలులు మరియు మద్యపానానికి వ్యతిరేకంగా ఆయన పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. "మద్యాన్ని తాకవద్దు, మాంసాన్ని ముట్టవద్దు" అని బోధించి ప్రజలను సంస్కరించారు.ఆయన భారతదేశానికి ఎందుకు ఆదర్శప్రాయుడు అంటేసేవాలాల్ మహారాజ్ బోధనలు (సప్త సిద్ధాంతాలు) కులమతాలకు అతీతంగా అందరికీ వర్తిస్తాయి:ప్రకృతి ఆరాధన: చెట్లను నరకవద్దు, నీటిని వృధా చేయవద్దు అని 250 ఏళ్ల క్రితమే ఆయన పర్యావరణ పరిరక్షణ గురించి చెప్పారు.ఆరోగ్యం మరియు పరిశుభ్రత: వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే పరిశుభ్రంగా ఉండాలని, ప్రకృతి సిద్ధమైన ఆహారం తీసుకోవాలని బోధించారు. అందుకే ఆయనను "ఆరోగ్య దైవం" అని కూడా పిలుస్తారు.అహింస: జీవహింస మహాపాపమని, అన్ని జీవుల పట్ల దయ కలిగి ఉండాలని ఆయన ఆశించారు.స్త్రీ గౌరవం: మహిళలను గౌరవించాలని, ఆడపిల్లలను చదివించాలని ఆయన ఆనాడే పిలుపునిచ్చారు.సంత్ సేవాలాల్ మహారాజ్ ఒక జాతికి మాత్రమే పరిమితం కాలేదు. ఆయన మానవత్వానికి, పర్యావరణానికి మరియు ధర్మానికి ప్రతినిధి. అందుకే ఆయనను భారతదేశం గర్వించదగ్గ గొప్ప సంస్కర్తగా కొలుస్తారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా ప్రకటించాలిని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాండు నాయక్, మాణిక్య నాయక్, మన్న నాయక్, పుణ్య నాయక్,శంకర్ నాయక్,చందర్ నాయక్, రవి, భీమా, సంతోష్,రమేష్, ప్రకాష్, రాహుల్, సునీల్,విశాల్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హైకమాండ్ ముందు జీవన్ రెడ్డి ఆవేదన

హైదరాబాద్, ఫిబ్రవరి 15: ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. పార్టీలో జరుగుతున్న పరిణామాలు, పదవుల కేటాయింపుపై ఆయన తన గళాన్ని విప్పారు. ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథన్ సవాంగ్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌లతో భేటీ అయిన జీవన్ రెడ్డి, పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.
పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటాను.. కానీ!జీవన్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టమైన వ్యాఖ్యలు చేశారు. 'నేను ఎప్పుడూ పార్టీ క్రమశిక్షణ గల కార్యకర్తనే. పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటాను. అయితే, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు జెండా మోసిన వారికే పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరుకుంటున్నాను' అని ఆయన పేర్కొన్నారు. తన ఆలోచనలు, సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని హైకమాండ్ ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో జరిగిన టికెట్ల కేటాయింపుపై జీవన్ రెడ్డి



గణంకాలతో సహా హైకమాండ్‌కు వివరించారు.గెలుపు గుర్రాల లెక్కలతో ఆవేదన..స్ట్రైక్ రేట్:స్ట్రైక్ రేట్: తనకు కేటాయించిన 16 బీ-ఫారమ్ లలో 9 మందిని గెలిపించుకున్నట్లు ఆయన గుర్తు చేశారు. ఇండిపెండెంట్లు: ఎంపీ సంజయ్ కుమార్ పక్కన పెట్టిన 9 మంది అభ్యర్థులు స్వతంత్రులుగా పోటీ చేసి గెలిచారని, అంటే వారు బలమైన అభ్యర్థులని ఆయన వాదించారు. సంజయ్‌కి 34 బీ-ఫారమ్ లు ఇస్తే కేవలం 14 మంది మాత్రమే గెలిచారని, తన వర్గం వారికి టికెట్లు రాకుండా పక్కన పెట్టడం వల్లే నష్టం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.అనుచరుల డిమాండ్: రాజ్యసభ సీటు ఇవ్వాల్సిందే!జీవన్ రెడ్డి మద్దతుదారులు కూడా ఏఐసీసీ సెక్రటరీ ముందు తమ వాదనను గట్టిగా వినిపించారు. జీవన్ రెడ్డి వంటి సీనియర్ నాయకుడిని విమర్శించడం సరికాదన్నారు. జీవన రెడ్డి పార్టీకి చేసిన సేవలను గుర్తించి, రానున్న రాజ్యసభ స్థానాన్ని జీవన్ రెడ్డికి కేటాయించాలని అనుచరులు, మద్దతుదారులు డిమాండ్ చేశారు. చైర్మన్ పదవుల కేటాయింపులో జీవన్ రెడ్డి వర్గానికి సముచిత స్థానం కల్పించాలని వారు కోరారు.

# అగ్రి వర్సిటీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం - సీఐడీ దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి

వరంగల్ : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరీక్షల్లో అక్రమాలపై పోలీసులకు కీలక ఆధారాలు లభ్యమయ్యాయి. ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై వర్సిటీ అంతర్గత విచారణతోపాటు సీఐడీ ప్రాథమిక దర్యాప్తులో సంచలన విషయాలు బయటకు వస్తున్నాయి. పీజేటీఏయూ పరిధిలోని మూడో సంవత్సరం విద్యార్థుల మొదటి సెమిస్టర్ 2025-26 పరీక్షలకు సంబంధించిన ఈ లీకేజీలో ఇంటిదొంగల నిర్వాకంపై కీలక సమాచారం లభించింది.ప్రశ్నపత్రాలు జిరాక్స్ తీసే సమయంలో : ఈ పరీక్షపత్రాల లీకేజీలో వరంగల్ వ్యవసాయ కళాశాలలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ కార్తిక్ కీలకపాత్ర వహించినట్లు సీఐడీ గుర్తించింది. ఇన్?సర్వీస్ విద్యార్థులకు పరీక్ష పత్రాలను అతనే లీక్ చేసినట్లుగా గుర్తించారు. ప్రశ్నాపత్రాల్ని జిరాక్స్ తీసే సమయంలోనే అతను తన సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీసినట్లుగా బయటపడింది. ఇలా చేయాలని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో పూర్వ ఇన్?సర్వీస్ విద్యార్థిగా పనిచేసిన శ్రీకాంత్ ఒత్తిడి చేసినట్లు విచారణలో గుర్తించారు. ఈక్రమంలోనే కార్తిక్ బ్యాంకు ఖాతాలను పరిశీలించడంతో పెద్దఎత్తున నగదు లావాదేవీలు జరిగినట్టు గుర్తించి దర్యాప్తు ముమ్మరం చేశారు. అంతేకాకుండా మరికొన్ని ప్రశ్నాపత్రాల లీకేజీకి సంబంధించిన సమాచారం వెల్లడి కావడం విస్తుగొలిపే అంశంగా మారింది.మూడో ఏడాది మొదటి సెమిస్టర్ మిడ్ ఎగ్జామ్స్ ప్రశ్నాపత్రాలను సిరిసిల్ల బీజేఆర్ వ్యవసాయ కళాశాలలో పొరుగు సేవల సిబ్బంది అజయ్ లీక్ చేసినట్లుగా తేలింది. అతడి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని తనిఖీ చేయగా గతంలో జరిగిన మరికొన్ని సెమిస్టర్ల





ప్రశ్నాపత్రాలను గుర్తించి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో కొన్నేళ్లుగా ఇన్సర్వీస్ విద్యార్థులకు సంబంధించిన పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకేజీ కొనసాగి ఉంటుందనే అనుమానాల నేపథ్యంలో సీఐడీ దర్యాప్తు మరింత ప్రాధాన్యం సంతరించుకొంది. ఈ దర్యాప్తు కొలిక్కివస్తే మరికొందరి పాత్ర బయటపడే అవకాశాలు ఉన్నాయి.అసాధారణ రీతిలో మార్కులు రావడంతో : క్లిష్టంగా భావించే ఓ పరీక్షలో ఇన్సర్వీస్ స్టూడెంట్లు అసాధారణ రీతిలో మార్కులు సాధించడం అనుమానాలకు దారి తీసింది. దీంతో వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, డీన్ ఝాన్సీరాణి గత ఏడాది డిసెంబర్ 24వ తేదీన జగిత్యాలలోని వ్యవసాయ కళాశాలలో తనిఖీలు నిర్వహించారు. నవంబర్ 17వ తేదీన జరిగిన ఆ పరీక్షకు సంబంధించి సీసీ కెమేరాలను పరిశీలించడంతో రమేశ్ అనే విద్యార్థి కదలికలు అనుమానస్పదంగా కనిపించాయి. ఈనేపథ్యంలోనే ఎంటమాలజీ హెచ్‌వోడీ నరేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ సైంటిస్ట్ అంజయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎన్.పి.రవికుమార్, సంపత్‌లతో కలిపి విచారణ బృందాన్ని నియమించింది.ఈ బృందం జనవరి 5న జగిత్యాలకు వెళ్లి విద్యార్థి రమేష్‌ను విచారించింది. అదే కళాశాలకు చెందిన ఇన్?సర్వీస్ విద్యార్థి శ్రీనివాస్ తనకు ప్రశ్నాపత్రాల్ని వాట్సప్‌లో పంపించినట్లు రమేశ్ వెల్లడించినట్టు సమాచారం. శ్రీనివాస్‌ను విచారించగా అశ్వరావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థి దుర్గారావు వాటిని తనకు పంపినట్లు తేలింది. అశ్వారావుపేట కళాశాలకే చెందిన విద్యార్థిని నుంచి తనకు వాట్సప్‌లో ప్రశ్నాపత్రాలు అందినట్లు దుర్గారావు వెల్లడించారు.కేసు దర్యాప్తు ముమ్మరం చేసిన సీఐడీ : అశ్వారావుపేట విద్యార్థినిని విచారించగా వరంగల్ వ్యవసాయ కళాశాలకు చెందిన మరో విద్యార్థిని వాట్సప్ లో పంపినట్లు తేలింది. ఇందుకోసం అశ్వారావుపేట కళాశాలలోని పలువురు విద్యార్థుల నుంచి తాను రూ.1.4 లక్షలను వసూలు చేసినట్లు అంగీకరించారు. అందులో నుంచి రూ.80వేలను వరంగల్ కళాశాల విద్యార్థిని బదిలీ చేసినట్లు చెప్పారు. వరంగల్ కళాశాల విద్యార్థినిని విచారించడంతో కార్తిక్ నిర్వాకం బట్టబయలయింది. కార్తిక్ సదరు విద్యార్థినికి వాట్సప్‌లో ప్రశ్నాపత్రాలను పంపినట్లు తేలింది. వరంగల్ విద్యార్థిని ద్వారానే ప్రశ్నాపత్రాలు వరంగల్, జగిత్యాల, పాలెం, ఆదిలాబాద్, రాజేంద్రనగర్, సిరిసిల్ల, అశ్వారావుపేట కళాశాలల్లోని ఇన్?సర్వీస్ విద్యార్థులకు చేరినట్లు అనుమానిస్తున్నారు. మొత్తంగా సీఐడీ ఈ కేసు దర్యాప్తును ముమ్మరం చేసింది. త్వరలోనే ఈ వ్యవహారంలో అరెస్టులు చేసే అవకాశం ఉంది.

# రెండోసారి కమలం చేజారిన ఇందూరు పీఠం మజ్లిస్‌తో కలిసి మేజిక్ ఫిగర్

నిజామాబాద్ :మున్సిపల్ కార్పొరేషన్ పీఠం భారతీయ జనతా పార్టీకి అందని ద్రాక్షలా మారింది. వరుసగా రెండుసార్లు సింగిల్ లార్జెస్ట్ పార్టీగా ఆవిర్భవించినప్పటికీ పీఠం మాత్రం దక్కక పోవటం చర్చనీయాంశంగా మారింది. ఉత్కంఠ భరితంగా సాగిన పోరులో చివరికి ఇందూరు మేయర్ పీఠం హస్తగతం అయింది. ఎంఐఎంతో కలిసి కాంగ్రెస్ పార్టీ మేయర్ పీఠాన్ని దక్కించుకుంది. అధికారికంగా ప్రకటన రావడమే మిగిలింది. అయితే ఈ ఎన్నిక ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. కాంగ్రెస్ -- బీజేపీ మధ్య నువ్వా నేనా అన్నట్లు సాగిన ఈ పోరులో చివరికి అధికార కాంగ్రెస్ పై చేయి సాధించింది. ఆ పార్టీ నుండి మేయర్ అభ్యర్థి ఎవరు అనేది ఇపుడు కీలంగా మారింది.నిజామాబాద్ మున్సి1పల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ బీజేపీ మధ్య పోరు కాక రేపింది. హోరా హోరీగా సాగిన ఈ ప్రక్రియలో చివరికి మేయర్ పీఠం హస్తగతం అయింది. మరోసారి మేయర్ పీఠం బీజేపీ చేజారింది. సోమవారం (ఫిబ్రవరి 16) మేయర్ ఎన్నిక అధికారికంగా జరగనున్న నేపథ్యంలో రెండూ పార్టీల బాలా బలాల విషయంలో ఇప్పటికే స్పష్టత వచ్చింది. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో మొత్తం 60 డివిజన్ లు ఉండగా బీజేపీ 28 స్థానాల్లో గెలుపొంది సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించింది.బీజేపీకి మరో మూడు ఎక్స్ అఫిషియో స్థానాలు ఉన్నాయి. నిజామాబాద్ ఎంపీ అరవింద్, అర్బన్ ఎమ్మెలే ధన్పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెలే పైడి రాకేష్ రెడ్డి ఓట్లతో కలిపి బీజేపీ సంఖ్య 31కి చేరింది. కానీ బీజేపీ కంటే రెండు ఓట్లు కాంగ్రెస్ పార్టీకి ఎక్కువగా ఉన్నాయి.కాంగ్రెస్ సంఖ్యను పరిశీలిస్తే కాంగ్రెస్ పార్టీ స్వతహాగా గెలిచిన స్థానాలు 17 కాగా, ఎంఐఎం గెలిచిన 14



స్థానాలు తన ఖాతాలో కలుపుకుంది. బీఆర్ఎస్ నుండి గెలిచిన ఏకైక అభ్యర్థి కూడా కాంగ్రెస్ శిబిరంలో చేరారు. దీనికి తోడు కాంగ్రెస్ పార్టీకి రెండు ఎక్స్ అఫీషియో ఓట్లు ఉన్నాయి. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఎమ్మెల్సీగా, రూరల్ ఎమ్మెలే భూపతి రెడ్డిలు ఎక్స్ అఫీషియో ఓటర్లుగా ఉన్నారు. అంటే కాంగ్రెస్ పార్టీ మొత్తం సంఖ్య 34 కు చేరింది. మేజిక్ ఫిగర్ దాటి, మేయర్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధం అయింది. ఇప్పటికే కాంగ్రెస్ -- ఎంఐఎం, బీఆర్ఎస్ అభ్యర్థులు హైదరాబాద్ క్యాంపులో ఉన్నారు. సోమవారం నేరుగా మేయర్ ఓటింగ్ కోసం మున్సిపల్ కార్యాలయానికి చేరుకుంటారని తెలుస్తోంది. అయితే కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి విషయంలో మంతనాలు కొనసాగుతున్నాయి. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్ ఈ విషయంలో కసరత్తు చేస్తున్నారు. సామాజిక వర్గాల సమీకరణలు లెక్కిస్తున్నారు. ప్రధానంగా నాలుగు పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. మున్నూరు కాపు సామాజికవర్గం నుండి పంచరెడ్డి లలిత, గౌడ సామాజికవర్గం నుండి పూజిత గౌడ్ లతో పాటు మరో ఇద్దరు అరుంధతి, ఉమారాణి పేర్లను పరిశీలిస్తున్నారుఇదిలా ఉంటే వరుసగా రెండు సార్లు బీజేపీ పార్టీకి మేయర్ పదవి దక్కినట్లే దక్కి చేజారిపోవటం చర్చనీయాంశంగా మారింది. గత మున్సిపల్ ఎన్నికల్లో కూడా బీజేపీకి 28 సీట్లు దక్కగా, అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ -- ఎంఐఎంతో కలిసి మేయర్ పీఠాన్ని దక్కించుకోగా, ఈసారి కాంగ్రెస్ పార్టీ అదే ఫార్ములాతో మేయర్ స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్ పీఠం బీజేపీకి అందని ద్రాక్షలా మారింది. ఆ పార్టీకి 28 సీట్ల ఫిగర్ అచ్చి రావడం లేదా అనే చర్చ నడుస్తుంది. కాకపోతే వరుసగా రెండు పర్యాయాలు ఆ పార్టీకి 28 సీట్లే రావడమేంటి?, రెండు సార్లు సేమ్ సీన్ రిపీట్ అవ్వడమేంటి అని చర్చించుకుంటున్నారు.కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేసిన మిగతా అన్ని రాజకీయ పార్టీల కన్నా సింగిల్ లార్జెస్ట్ పార్టీగా నిలిచినా అధికారం దక్కకపోవడం పట్ల బీజేపీ తీవ్రంగా మదన పడుతుంది. ఇందులో భాగంగానే ఎంఐఎం తో కలిసి ఇతర పార్టీలు రెండు సార్లు మేయర్ పీఠం దక్కించుకోవడంపై ఎంపీ అరవింద్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు తిరస్కరించిన పార్టీలు మేయర్ పదవులను గద్దల్లా తన్నుకుపోతున్నాయని ధర్మపురి మండిపడ్డారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని దిగజారుతున్నారని ఆరోపించారు. ఒక్క స్థానంలో గెలిచిన బీఆర్ఎస్ అభ్యర్థిని పోలీసులతో కాంగ్రెస్ పార్టీ కిడ్నాప్ చేయించిందని సంచలన వీడియోను సోషల్ మీడియా ఎక్స్ లో పోస్టు చేశారు. దానిని కాంగ్రెస్ పార్టీ ఖండించింది. మొత్తం మీద నిజామాబాద్ మేయర్ పీఠం మరోసారి బీజేపీ చేజారిపోయింది. పీఠం దక్కినట్లే దక్కి రెండు సార్లు మిస్ అవడం కాషాయదళం జీర్ణించుకోలేక పోతుంది.

# జగిత్యాల ఎపిసోడ్‌కు ఫుల్‌స్టాప్

హైదరాబాద్/జగిత్యాల, ఫిబ్రవరి 15: గత కొద్ది రోజులుగా జగిత్యాల కాంగ్రెస్ రాజకీయాల్లో సెగలు పుట్టించిన అంతర్గత విభేదాలు ఎట్టకేలకు సద్దుమణిగాయి. ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథన్ సవాంగ్ రంగప్రవేశం చేసి, ఇరు వర్గాల నేతలతో జరిపిన చర్చలు సఫలమయ్యాయి. దీంతో జగిత్యాల ఎపిసోడ్‌కు ముగింపు పడినట్లు అయింది.నేతలతో సవాంగ్ భేటీ.. క్లాస్ పీకిన అధిష్టానంఏఐసీసీ సెక్రటరీ సవాంగ్.. ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీ మంత్రి జీవన్ రెడ్డితో విడివిడిగా, అనంతరం కలిసి చర్చలు జరిపారు. పార్టీ అంతర్గత విషయాలను రోడ్డుపైకి తీసుకురావడం వల్ల కేడర్‌లో అయోమయం నెలకొంటుందని ఆయన సున్నితంగా హెచ్చరించారు. క్రమశిక్షణే ముఖ్యమని, పార్టీ తీసుకునే తుది నిర్ణయానికి ఇరువురు నేతలు కట్టుబడి ఉండాలని సవాంగ్ స్పష్టం చేశారు. ఐక్యత చాటాలని, రాబోయే




ఎన్నికలు, పార్టీ బలోపేతం దృష్ట్యా నేతలు కలిసి పనిచేయాలని సూచించారు.జెండా మోసిన వారికే పట్టం!ఈ భేటీలో అత్యంత కీలకమైన నిర్ణయం పదవుల కేటాయింపుపై జరిగింది. పార్టీ కోసం కష్టపడి, జెండా మోసిన నిజమైన కార్యకర్తలకు, పాత తరం నాయకులకే మున్సిపల్ చైర్మన్ వంటి కీలక పదవులు ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించింది. ఇది జీవన్ రెడ్డి వర్గానికి కొంత ఊరటనిచ్చే అంశంగా కనిపిస్తోంది.జీవన్ రెడ్డి డిమాండ్లపై సానుకూలత తొలి నుంచి జీవన్ రెడ్డి వాదిస్తున్నట్లుగా.. పార్టీని నమ్ముకుని ఉన్న వారికే ప్రాధాన్యత ఇవ్వాలన్న సూచనను ఏఐసీసీ పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం. సంజయ్ కుమార్ కూడా పార్టీ ప్రయోజనాల దృష్ట్యా సర్దుకుపోయేందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది.ఎపిసోడ్‌కు ఫుల్‌స్టాప్..ఈ భేటీతో జగిత్యాల కాంగ్రెస్‌లో నెలకొన్న అనిశ్చితి తొలిగిపోయింది. నేతలు ఇద్దరూ కలిసి పనిచేస్తామని హామీ ఇవ్వడంతో కార్యకర్తలు ఊపిరి పీల్చుకుంటున్నారు. పదవుల పంపకంలో 'విధేయత'కే పెద్దపీట వేయాలని నిర్ణయించడం ద్వారా పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహం నింపే ప్రయత్నం చేస్తోంది కాంగ్రెస్ అధిష్టానం.

# గ్రామీణ ప్రాంత క్రీడలను ప్రోత్సహించాలి



వార్త ప్రతిక :-తొర్రూరు :గ్రామీణ ప్రాంత క్రీడాలను ప్రోత్సహించాలని పిహెచ్ఎస్ పిడి ప్రవీణ్ కుమార్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం మేరా యువ భారత్ వరంగల్ కేంద్రం వారి ఆధ్వర్యంలో స్థానిక జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలోతొర్రూరు మండలాల బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ కి 15 నుంచి 29 సంవత్సరాల యువతి, యువకుల కోసం నిర్వహించిన క్రీడలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రీడలకు విద్యార్థులు అత్యధిక సంఖ్యలో పాల్గొనడం అభినందనీయమన్నారు.క్రీడలు ఆడడం వల్ల విద్యార్థులకు మేధా శక్తి,శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో మేరా యువ భారత్ వాలంటీర్ భానోత్ వీరన్న, ఉపాధ్యాయ పీడీలు మరియు విద్యార్థిని,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయుల వైభవ సాక్షిగా అమ్మపాలెంలో ముక్తేశ్వర స్వామి ఉత్సవాలు ఘనంగా ప్రారంభం



వార్త పత్రిక, డోర్నకల్ :డోర్నకల్ మండలంలోని అమ్మపాలెం గ్రామంలో కాకతీయుల సామ్రాజ్యపు రాజులు ప్రతిష్ఠించిన ప్రాచీన ముక్తేశ్వర స్వామి వారి వార్షిక ఉత్సవాలు భక్తి శ్రద్ధల నడుమ ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవాలయ కమిటీ చైర్మన్ రాందేని బసవయ్య, ప్రధాన కార్యదర్శి వల్లభనేని రవికుమార్, ఉపాధ్యక్షులు గాదె వెంకన్న, సర్పంచ్ రాణి బాలస్వామి ఆధ్వర్యంలో వేడుకలను ప్రారంభించారు.డోర్నకల్ పట్టణ వాసులతో పాటు బంజర, పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలకు ప్రత్యేక శోభను తీసుకువచ్చారు. గుడి పూజారులు హరి నృసింహ శివ ప్రసాద్ శర్మ వేదమంత్రోచ్చారణల మధ్య శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.
సోమవారం స్వామివారికి ప్రత్యేక అభిషేక కార్యక్రమం నిర్వహించి అనంతరం అన్నప్రసాదం పంపిణీ చేయనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కరుణాకటాక్షాలు పొందాలని కమిటీ సభ్యులు కోరారు.

# శివనామస్మరణతో మహాశివరాత్రి అభిషేకం పూజలో పాల్గొన్న

- చిలువేరు సమ్మి గౌడ్



వార్త ప్రతిక:-కేసముద్రం :
మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కాట్రపల్లి గ్రామంలోని కాకతీయుల శివాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివనామ స్మరణతో దేవాలయ అర్చకులు వరంగంటి వెంకటాచార్యుల ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ సూరయ్య, పెద్దలు విజయపాల్ రెడ్డి, కాట్రపల్లి యువత తో కలిసి అభిషేకం అర్చన చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్..కొన్నేళ్లుగా ప్రతీ సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా ఆ మహాశివుడు,త్రినేత్రుడు ఆశీర్వాదశీ అందేలా నాతో పూజలు చేపించి, నాకు అండగా నిలుస్తున్న గ్రామ పెద్దలకు, యువతకు మహాశివరాత్రి శుభాకాంక్షలతో పాటు కృతజ్ఞతలు తెలిపారు సమ్మిగౌడ్.ఈ పూజా కార్యక్రమంలో వీరితోపాటుగ్రామ సర్పంచ్ ఎదరబోయిన సూరయ్య,ఉప సర్పంచ్ చాగంటి యాదగిరి రావుల విజయపాల్ రెడ్డి,సామల నర్సయ్య,చాగంటి రాము,మోడెం రాజు,కొండపల్లి రాకేష్ రెడ్డి, పలుస రాకేష్ గౌడ్,శీలం మహేష్ చీకటి ప్రశాంత్ ఎదురబోయిన సునీల్ గుడ్ల శ్రీనివాస్ బూర రాజకుమార్ మొలకల విశాల్ యశ్వంత్ సంధ్య సందేపాక వెంకన్న బొంత వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఎక్స్‌అఫీషియో కోసం అక్రమంగా ఓటు నమోదు చేయించుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్సీ.


కాగజ్‌నగర్ : మున్సిపల్ పీఠం కోసం కాంగ్రెస్ పార్టీ నీచ రాజకీయాలకు తెరలేపింది. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో తనకు ఓటు లేకున్నా ఎక్స్‌అఫీషీయో కోసం కాంగ్రెస్ ఎమ్మెల్సీ దండే విఠల్ అక్రమంగా తప్పుడు ఓటు నమోదు చేయించుకున్నారు. దీనికి సంబంధించి ఆధారాలను సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బయటపెట్టారు.ఈ 16న జరిగే ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేయనున్నాడని.. దానిని అడ్డుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని కోనేరు కోనప్ప ఆరోపించారు. ఎక్స్‌అఫీషియో ఓటు వేసేందుకు ఎమ్మెల్సీ దండే విఠల్ చేత తప్పుడు మార్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఓటు నమోదు చేయించిందని తెలిపారు.

# సంత్ సేవాలాల్‌కు నివాళు లర్పించిన సీఎం చంద్రబాబు




**అమరావతి:** గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనూ సేవాలాల్ జయంతి వేడుకలను గిరిపుత్రులు వేడుకగా చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాళులు అర్పించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. అహింస, మానవత్వం, సమానత్వానికి సేవాలాల్ మార్గదర్శనం చేశారని ముఖ్యమంత్రి కొనియాడారు. సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా ఆ మహనీయుడు చూపిన శాంతి మార్గాన్ని, ఆయన బోధించిన జీవన విలువలను మనసారా స్మరించుకుందామని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారుకాగా, ఉండవల్లిలోని తన కార్యాలయంలో శనివారం నాడు నిర్వహించిన సంత్ సేవాలాల్ మహరాజ్ 287 జయంతి వేడుకల్లో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..'రూ.50లక్షలు కేటాయించి సేవాలాల్ జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నాం. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు కేటాయిస్తాం. ఆయన మన రాష్ట్రంలో జన్మించడం మనందరి అదృష్టం. సేవాలాల్ సిద్ధాంతాలు ఎప్పటికీ ఆదర్శమే. సేవాలాల్ స్ఫూర్తితో గిరిజనుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. నీట్, ఐఐటీ సీట్లు సాధించేలా గురుకులాల్లో ఎస్టీ విద్యార్థులకు శిక్షణ అందిస్తాం. ఆదివాసీ ప్రాంతాల్లో పెద్దఎత్తున మౌలిక వసతులు కల్పిస్తున్నాం. ఉచితంగా సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేస్తున్నాం. 2026-27 వార్షిక బడ్జెట్‌లో రూ.9,190 కోట్లు ఎస్టీల కోసం కేటాయించాం' అని చెప్పారు.

## ఎన్టీఆర్ ట్రస్ట్ అంటే భరోసా, నమ్మకం



**అమరావతి, ఫిబ్రవరి 15:** ఎన్టీఆర్ ట్రస్ట్ అంటే ఒక భరోసా, నమ్మకమని.. ఏపీ విద్యా, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విద్య, వైద్యం, ఉపాధి ద్వారా ఈ ట్రస్ట్ ఎందరో జీవితాల్లో వెలుగులు నింపిందని తెలిపారు. ఈ ట్రస్ట్ ఎలాంటి లాభాపేక్ష లేకుండా ప్రజలకు సేవలందిస్తోందని వివరించారు. సామాజిక సేవే పరమావధిగా ముందుకు సాగుతోందని చెప్పారు. ఆదివారంతో 30వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ట్రస్ట్‌కు లోకేశ్ శు భాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారాయన. అలాగే.. ఆదివారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా తెలుగు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు మంత్రి లోకేశ్. భోళా శంకరుడు లింగోద్భవం చెందిన పవిత్రమైన రోజు.. ఈ మహా శివరాత్రి అని ఆయన పేర్కొన్నారు. ఉపవాసం, జాగరణతో నీలకంఠుడి కృపకు ప్రజలు పాత్రులు కావాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు.

## 53శాతం సీట్లలో విజేతలు బీసీలే: ఆర్.కృష్ణయ్య



**రాంనగర్:** మున్సిపల్ ఎన్నికల్లో 53శాతం సీట్లలో బీసీలు గెలవడం వారి చైతన్యానికి నాంది అని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. ప్రాదేశిక (ఎంపీటీసీ, జడ్‌పీటీసీ) ఎన్నికల్లో చట్టబ ద్ధంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని.. అంత వరకూ రాష్ట్ర ప్రభుత్వాన్ని వదిలి పెట్టే ప్రసక్తి లేదన్నారు. ప్రభుత్వంతోపాటు తమకు అన్యాయం చేయడానికి కుట్రలు చేసిన పార్టీలకు బీసీలు తగిన గుణపాఠం నేర్పారని విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో శనివారం జరిగిన ఓ సమావేశంలో ఆయన చెప్పారు. మునిసిపల్ ఎన్నికల్లో 42% అమలు చేస్తామని ప్రకటించి 28 శాతా నికి తగ్గించి అక్రమాలకు పాల్పడటం దుర్మార్గమని కృష్ణయ్య ఆరోపించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై హైకోర్టులో దాఖలైన 62 కేసుల విచారణకు సీనియర్ న్యాయవాదులను నియమించాలన్నారు. ఆయా కేసుల విచారణను చేపట్టేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు.

## బడ్జెట్ ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పిలుపు



**విశాఖపట్నం, ఫిబ్రవరి 15:** ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మించే దిశగా కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్‌ను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని టీడీపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఇవాళ (ఆదివారం) విశాఖపట్నం నుంచి కూటమి ఎమ్మెల్యేలు, కీలక నేతలతో ఆయన నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో బడ్జెట్ ప్రాధాన్యతలపై సుదీర్ఘంగా చర్చించారు. 'విధ్వంసం నుంచి వికాసం వైపు' సాగుతున్న ఈ ప్రయాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వ్యవస్థను గాడిలో పెట్టే 'విజన్ డాక్యుమెంట్'గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా మారిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మళ్లీ పురోగతి పట్టించేలా ఈ బడ్జెట్ ఉందని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. భారత శతాబ్ది ఉత్సవాల నాటికి ఏపీ అగ్రగామిగా ఉండాలనే లక్ష్యంతో (విజన్-2047) ఈ బడ్జెట్ రూపకల్పన జరిగిందని చెప్పారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో జనసేన నేత, మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ కూడా పాల్గొని, కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని ఎలా సమతుల్యం చేస్తోందో వివరించారు. ఇది గణాంకాల పుస్తకం కాదు.. ప్రజల జీవిత రేఖ: ఎమ్మెల్యే గణబాబుబడ్జెట్‌పై ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఈ బడ్జెట్ కేవలం అంకెలతో కూడిన పుస్తకం కాదు, ఇది కోట్లాది మంది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే ఒక బ్లూ ప్రింట్. మాటల కోసం కాకుండా, చేతల్లో ప్రగతిని చూపించే విజన్ డాక్యుమెంట్ ఇది.' అని ఆయన వ్యాఖ్యానించారు. కూటమి నేతలు ఈ సందర్భంగా బడ్జెట్‌లోని కీలక అంశాలను ప్రస్తావించారు. సుమారు రూ. 3.32 లక్షల కోట్లతో కూడిన భారీ బడ్జెట్‌గా పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళా సంక్షేమం కోసం దాదాపు రూ. 91,527 కోట్లు కేటాయించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టులతో పాటు విద్యా రంగానికి (రూ. 32,308 కోట్లు) అత్యధిక ప్రాధాన్యతనిచ్చారని పేర్కొన్నారు.

# పరమశివుని ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకుంటున్నాను



**అమరావతి, ఫిబ్రవరి 15:** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పరమేశ్వరుడి అనుగ్రహంతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) వేదికగా ఒక సందేశాన్ని విడుదల చేశారు. క్షేత్రాల పవిత్రతకు పెద్దపీటఆంధ్రప్రదేశ్ పుణ్య భూమి అని కొనియాడిన పవన్ కళ్యాణ్.. శ్రీశైల జ్యోతిర్లింగ క్షేత్రం, శ్రీకాళహస్తి వాయులింగ క్షేత్రం, పంచారామ క్షేత్రాల విశిష్టతను గుర్తు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన నాటి నుంచి ఆలయాల పవిత్రతను కాపాడటమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలురాష్ట్రవ్యాప్తంగా ఉన్న 41 ప్రముఖ శైవ క్షేత్రాల్లో ప్రభుత్వం అధికారికంగా శివరాత్రి వేడుకలను నిర్వహిస్తోందని, ఇది తమ ప్రభుత్వ భక్తి భావానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. 'శ్రీకాళహస్తి గిరి ప్రదక్షిణ మార్గంలో నూతన సిమెంటు రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించాం. కోటప్పకొండ భక్తుల సౌకర్యార్థం గిరి ప్రదక్షిణ మార్గం రోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశాం.' అని పవన్ తెలిపారు. ఓఆలయాలకు మెరుగైన రవాణా సౌకర్యాలుప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలోని చిన్న, పెద్ద ఆలయాలన్నింటికీ రోడ్డు సౌకర్యం కల్పించేందుకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. 'ఆలయాల అభివృద్ధికి, ధర్మ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ఆ పరమశివుని ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకుంటున్నాను.' అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరుకుంటూ భక్తుల ందరికీ.. పవన్ కళ్యాణ్ శివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు.

# జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు ప్రారంభించిన పవన్ కల్యాణ్




**మంగళగిరి:** జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేదిశగా ఆ పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక ముందడుగు వేశారు. ఫిబ్రవరి 15న ఉదయం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో 'క్రియాశీలక సభ్యత్వ నమోదు' కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారాయ న. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్వయంగా మొదటి సభ్యత్వాన్ని తీసుకో వడమే కాకుండా.. సభ్యత్వ నమోదు( ప్రక్రియ కోసం తన వంతుగా రూ.2 కోట్ల భారీ విరాళాన్ని పార్టీకి అందజేశారు పవన్. పార్టీ భావజాలాన్ని లోతుగా అర్థం చేసుకుని.. పార్టీ సిద్ధాం తాలు, ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసేందుకు ఎవరైతే ముందుకు వచ్చి పార్టీ సభ్యత్వం తీసుకుంటారో వారిని 'ఉద్యమి'గా పిలుస్తామన్నారు. పార్టీ పోరాటానికి మరింత బలాన్ని అందించి, నవతరంలో ప్రేరణ కలిగించి పార్టీ సిద్ధాంతాలకి ఆకర్షితులను చేసి సభ్యత్వ నమోదు చేసేవారిని 'సాధక్'గానూ, జనసేన పార్టీ చేస్తున్న ప్రజా, రాజకీయ పోరాటానికి పరోక్షంగా తమ వంతు సమయాన్ని, ఆర్థిక, సాంకేతిక, సేవా, మేధా సహాయ సహకారాలు అందిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేసేవారిని 'ప్రదాత'గా పిలుస్తామని ప్రకటించారు పవన్ కల్యాణ్. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. 'జనసేన పార్టీని 150 మందితో పార్టీని ప్రారంభించాం. 2021లో మొదటి విడత క్రియాశీలక సభ్యత్వం ప్రారంభించినప్పుడు 90 వేల పేర్లు నమోదు చేశాం. ఎన్నికలకు ముందు ఆ సంఖ్య 6 లక్షలకు చేరింది. ఎన్నికల తర్వాత 12.98 లక్షల సభ్యత్వాలు సాధించాం. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారి నుంచి కూలీ పనులు చేసుకునే వారు, చదువుకున్న వారు.. ఇలా ఎంతో మంది ఈ ప్రక్రియలో భాగస్వాములయ్యారు. పార్టీ భావజాలాన్ని అర్థం చేసుకుని, పార్టీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేవారు మనకు ముఖ్యం. అలాంటి వారే పార్టీకి అవసరం' అని చెప్పారు. కార్యక్రమంలో నాదెండ్ల మనోహర్, పిడుగు హరిప్రసాద్ తదితర నేతలు పాల్గొన్నారు.

# కొత్త ఉద్యోగంలో చేరిన జేడీ లక్ష్మీనారాయణ




**అమరావతి:** వాసగిరి వెంకట లక్ష్మీనారాయణ.. ఈ పేరు చెప్పగానే చాలా మందికి ఆయనెవరో గుర్తు రాకపోవచ్చు. కానీ జేడీ లక్ష్మీనారాయణ అంటే చాలు ఠక్కున గుర్తుపడతారు. సీబీఐ అధికారిగా జగన్ అక్రమాస్తుల కేసు సహా అనేక హై ప్రొఫైల్ కేసులను దర్యాప్తు చేయడంతో ఆయన పేరు అప్పట్లో మార్మోగింది. మహారాష్ట్ర కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అయిన వీవీ లక్ష్మీనారాయణ .. ముంబైలో అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ జనరల్‌గా పదవీ విరమణ పొందారు. అనంతరం రాజకీయాల్లోకి వచ్చిన ఆయన జనసేన తరఫున విశాఖపట్నం ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత 2023లో జై భారత్ నేషనల్ పార్టీ పేరిట సొంత పార్టీ పెట్టారు. అంతకు ముందు తూర్పుగోదావరి జిల్లా ధర్మవరంలో ఆయన పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం కూడా చేశారు. ఆయన కుమారుడు కూడా ఆలిండియా సర్వీసులో పని చేస్తున్నారు. జేడీ లక్ష్మీనారాయణ తాజాగా ఓ ఉన్నత ఉద్యోగంలో చేరారు. ఈవీట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఆపరేషన్స్ విభాగంలో వైస్ ప్రెసిడెంట్‌గా ఆయన చేరారు. ఈవీట్రాన్స్ అనేది మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ ( మెయిల్)కు అనుబంధ సంస్థ. ఐపీఎస్ అధికారిగా దాదాపు మూడు దశాబ్దాలపాటు సుదీర్ఘ సేవలు అందించిన జేడీ లక్ష్మీనారాయణను ఈవీట్రాన్స్ వైస్ ప్రెసిడెంట్‌గా తీసుకోవడానికి కారణం ఉంది. జేడీ లక్ష్మీనారాయణ ఎన్ఐటీ వరంగల్ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ చదివారు. అనంతరం ఐఐటీ మద్రాస్ నుంచి ఎంటెక్ పూర్తి చేశారు. తర్వాత అశోక్ లేల్యాండ్ ఆర్ అండ్ డీ విభాగంలో కెరీర్ మొదలుపెట్టారు. ఆ సమయంలో కమర్షియల్ వెహికల్ సిస్టమ్, మాన్యుఫ్యాక్చరింగ్ ఎన్విరాన్మెంట్స్ మీద ఆయన అనుభవం సంపాదించారు. ఈవీట్రాన్స్ సంస్థ ఎలక్ట్రిక్ బస్సుల తయారీని వేగవంతం చేస్తోంది. ఈ క్రమంలో లక్ష్మీనారాయణ అనుభవం, కార్య దక్షత తమకు ఉపకరిస్తాయని ఆ సంస్థ భావిస్తోంది. లక్ష్మీనారాయణ నియామకం విషయాన్ని ఈవీట్రాన్స్ సంస్థ లింక్డ్ఇన్ ద్వారా స్వయంగా వెల్లడించింది. 2006-13 మధ్య డిప్యూటేషన్ మీద సీబీఐకి వెళ్లిన లక్ష్మీనారాయణ.. జాయింట్ డైరెక్టర్ స్థాయికి ఎదిగారని.. ఈ సమయంలో ఆయన అనేక హైప్రొఫైల్ కేసులను దర్యాప్తు చేశారని కూడా ఈవీట్రాన్స్ గుర్తు చేసింది. తెలంగాణ ఆర్టీసీలో నడుస్తోన్న ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సులను ఈ సంస్థే తయారు చేసింది. ఒక్క తెలంగాణ ఆర్టీసీనే కాకుండా.. ముంబై, పుణే, గోవా తదితర ప్రాంతాల్లో ఈ సంస్థ తయారు చేసిన ఎలక్ట్రిక్ బస్సులు పరుగులు తీస్తున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న ఈవీట్రాన్స్.. దేశంలోనే అతిపెద్ద ఎలక్ట్రిక్ బస్ ఆపరేటర్‌గా అవతరించింది. ఇదిలా ఉండగా.. లక్ష్మీనారాయణ భార్య ఇటీవల ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌లో రూ.2.58 కోట్లు మోసపోయిన సంగతి తెలిసిందే. ట్రేడింగ్ నిపుణులమని పరిచయం చేసుకొని.. భారీ లాభాలు ఆశచూపిన స్కామర్లు ఊర్మిళను మోసం చేశారు. దీంతో లక్ష్మీనారాయణ దంపతులు జనవరి నెలలో సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు.

# పోలీసులకు బిగ్ రిలీఫ్ ఆ పథకం పునరుద్ధరణ.




**అమరావతి:** 2026 -27 బడ్జెట్ సందర్భంగా ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలోని పోలీసులకు శుభవార్త చెప్పింది. పోలీసుల కోసం ఓ పథకాన్ని పునరుద్ధరించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రకటించారు. బడ్జెట్ ప్రసంగంలో ఏపీ ప్రభుత్వం పోలీస్ శాఖలో తీసుకువచ్చిన ఆధునికీకరణ కార్యక్రమాలతో పాటుగా.. వారికి అమలు చేస్తున్న సంక్షేమ చర్యల గురించి పయ్యావుల కేశవ్ వివరించారు. ఈ క్రమంలోనే పోలీస్ శాఖలో ఉచిత బీమా కవరేజీ అందించే గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీమ్ పునరుద్ధరించనున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద కానిస్టేబుల్ నుంచి డీజీపీ వరకు రూ.20 లక్షలు నుంచి రూ.45 లక్షల వరకు ఉచితంగా బీమా కల్పిస్తారు. ఇదే సమయంలో పోలీస్ శాఖకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మరికొన్ని శుభవార్తలు కూడా అందించారు. మూడు వేల నూతన వాహనాలను ఏపీ పోలీసులకు త్వరలో అందించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో డిజిటల్ అరెస్టులు, సైబర్ నేరాల కట్టడి కోసం పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు పయ్యావుల కేశవ్ తెలిపారు. టెక్నాలజీ సాయంతో ఏపీ పోలీస్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామన్న మంత్రి.. ఇందులో భాగంగా ఏఐ ఆధారిత ప్రాజెక్టులు, స్మార్ట్ పోలీసింగ్ ల్యాబులు, సీసీటీవీ, డ్రోన్లు, ఆధునిక కమ్యూనికేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వివరించారు.


సోమవారం,
ఫిబ్రవరి 16, 2026

వార్తపత్రిక
జాతీయ తెలుగు దినపత్రిక



# ఎప్‌స్టీన్ వివాదంలోకి కపిల్ సిబల్- కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం

: ఎప్‌స్టీన్ ఫైల్స్ వివాద అంశంపై కాంగ్రెస్ - బీజేపీ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ వివాదం అంతర్జాతీయంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. దేశంలోనూ రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. అమెరికా విడుదల చేసిన 'ఎప్‌స్టీన్ ఫైల్స్'లో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ పేరు కనిపించడంతో ఆయన రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. ప్రధాని మోదీ పేరు కూడా ఉండటంతో మొన్నటి వరకు బీజేపీ లక్ష్యంగా కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. అయితే తాజాగా ఈ వివాదంలో మాజీ కాంగ్రెస్ నేత వచ్చి చేరారు. దీంతో హస్తం పార్టీని బీజేపీ లక్ష్యంగా చేసుకొని విమర్శలు గుప్పించింది. దీంతో కమలం పార్టీ ఆరోపణలపై కూడా కాంగ్రెస్ అదే స్థాయిలో స్పందించింది. ఇంతకీ రెండు పార్టీల మధ్య జరిగిన మాటల యుద్ధాన్ని ఓసారి పరిశీలిద్దాం.2010లో అమెరికాలో జరిగిన ఒక కార్యక్రమంలో లైంగిక నేరాలకు పాల్పడిన జెఫ్రీ ఎప్‌స్టీన్ నిధులతో కూడిన అవార్డును మాజీ కేంద్ర మంత్రి కపిల్ సిబల్ అందుకున్నారని బీజేపీ ఆరోపించింది. ఈ విషయంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందించాలని డిమాండ్ చేసింది. ఈ అంశం గురించి సిబల్‌ను అడగ్గా వీటిని చెత్త ఆరోపణలుగా కొట్టిపారేశారు. కాంగ్రెస్ కూడా ఈ ఆరోపణలను తిరస్కరించింది. ఆ కార్యక్రమానికి సిబల్ అతిథి కాదని స్పష్టం చేసింది.యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో మన్మోహన్ సింగ్ సర్కారులో కపిల్ సిబల్ కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నారు. విద్యలో ప్రపంచ స్థాయి సహకారానికి ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ఆ అవార్డు లభించిందని కాంగ్రెస్ మీడియా విభాగాధిపతి పవన్ ఖేడా తెలిపారు. దీనికి జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ఎటువంటి సంబంధం లేదని ఆయన పేర్కొన్నారు. కపిల్ సిబల్ 2022లో కాంగ్రెస్‌ను



వీడారు. ప్రస్తుతం ఆయన సమాజ్‌వాదీ పార్టీ మద్దతుతో స్వతంత్ర రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు.సోషల్ మీడియాలో బీజేపీ పోస్టుఅంతకుముందు బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి ఎక్స్?లో పోస్టు చేశారు. ఎప్‌స్టీన్ సహకారంతో ఇచ్చిన అవార్డును గాంధీ కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన కపిల్ సిబల్ అందుకున్నారని ఆ పోస్టులో పేర్కొన్నారు. కాంగ్రెస్ విదేశీ విభాగం అధిపతి శ్యామ్ పిట్రోడాకు కూడా ఇటువంటి వర్గాలతోనే సంబంధాలు ఉన్నాయని ఆయన విమర్శించారు. సిబల్ ఆ అవార్డు అందిన కొద్ది కాలానికే, అప్పటి కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వంలో అనేక విధానపరమైన మార్పులు చోటుచేసుకున్నాయని ప్రదీప్ భండారి ఆరోపించారు. ఇవి కేవలం యాదృచ్ఛికాలేనా?, లేక కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాలను ప్రభావితం చేయడానికి ఎప్‌స్టీన్ వంటి బాహ్య శక్తులు ప్రయత్నించాయా? దీనికి రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూనే, "ఎప్‌స్టీన్ --- కాంగ్రెస్ వాలెంటైన్" అంటూ వ్యంగ్యంగా ఆ పోస్టులో పేర్కొన్నారు.బీజేపీ మరో అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఇదే అంశంపై కాంగ్రెస్‌ను విమర్శించారు. ఎప్‌స్టీన్‌తో కాంగ్రెస్ నడుపుతున్న 'మొహబ్బత్ కీ దుకాన్' ఎలాంటిది? ఎప్‌స్టీన్ నిధులు సమకూర్చిన ఐఐఈ నుంచి కపిల్ సిబల్ ఎందుకు అవార్డును స్వీకరించారు? అని ఆయన తన పోస్ట్‌లో ప్రశ్నించారు. రాహుల్ గాంధీకి పార్లమెంటులో చాలా మాట్లాడటం ఇష్టం కదా? దీని గురించి ఇప్పుడు ఆయన ఏమైనా చెబుతారా? అని పూనావాలా ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ ఎదురుదాడిబీజేపీ నేతల ట్వీట్లపై కాంగ్రెస్ నేత పవన్ ఖేడా ఎదురుదాడికి దిగారు. బీజేపీకి చెందిన ప్రదీప్ భండారి, షెహజాద్ పూనావాలా కలిసి కపిల్ సిబల్ పేరు జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉందని తప్పుడు ప్రచారం చేయడానికి ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. బీజేపీ షేర్ చేసింది 59 పేజీల డాక్యుమెంట్ అని, అందులో కాన్ఫరెన్స్‌ల నుంచి ఫ్యాషన్ షోల వరకు అనేక కార్యక్రమాలను జాబితా చేశారన్నారు. కపిల్ సిబల్ పేరు 55వ పేజీలో 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్' కార్యక్రమం కింద ఉందన్నారు. కానీ బీజేపీ నేతలు అంత దూరం చదవడానికి ఇష్టపడలేదని, పేరు చూడగానే ఉత్సాహపడిపోయి, ప్రతిపక్షాలను ఈ గందరగోళంలోకి లాగాలని ఒక కట్టుకథను అల్లారని విమర్శించారు. తద్వారా తమ సొంత నేత హర్దీప్ సింగ్ పూరీ చుట్టూ అల్లుకున్న ప్రశ్నల నుంచి ప్రజల దృష్టిని మళ్లించాలని చూస్తున్నారని ఆరోపించారు.

# బంగ్లాదేశ్ ప్రధాని ప్రమాణస్వీకారానికి ప్రధాని మోదీకి ఆహ్వానం



**బంగ్లాదేశ్** :బంగ్లాదేశ్ పార్లమెంటు ఎన్నికల్లో ఘన విజయం సాధించిన బీఎన్‌పీ (బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ) ఛైర్మన్ తారిక్ రహ్మాన్ త్వరలో ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు . ఫిబ్రవరి 17న జరగనున్న ఈ కార్యక్రమానికి భారత ప్రధాని మోదీకి ఆహ్వానం అందింది . బంగ్లాదేశ్ మధ్యంతర ప్రభుత్వ సలహాదారు ప్రొఫెసర్ మొహమ్మద్ యూనస్ ప్రధాని మోదీతో సహా 13 దేశాధినేతలను ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆహ్వానించినట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అయితే, ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరు కాకపోవచ్చని తెలుస్తోంది. అదే రోజున ఫ్రాన్స్ అధ్యక్షుడితో కలిసి ప్రధాని మోదీ కొన్ని కార్యక్రమాల్లో పాల్గొననున్న నేపథ్యంలో బంగ్లాదేశ్ వెళ్లకపోవచ్చని తెలిసింది. అయితే, ప్రధానికి బదులు విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ లేదా ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ బంగ్లాదేశ్ ప్రధాని ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉంది .భారత్‌తో పాటు చైనా, సౌదీ అరేబియా, పాకిస్థాన్, టర్కీ, యూఏఈ, ఖతర్, మలేషియా, బ్రూనై, శ్రీలంక, నేపాల్, మాల్దీవులు, భూటాన్ దేశాల అధినేతలకు బంగ్లాదేశ్ ప్రధాని ప్రమాణస్వీకారోత్సవానికి ఆహ్వానాలు అందాయి. పార్లమెంటు హౌస్‌లోని సదరన్ ప్లాజా భవనంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తారిక్ రహ్మాన్‌తో దేశ ప్రధాన ఎన్నికల కమిషనర్ ప్రమాణస్వీకారం చేయించనున్నారు. ఇది తమ దేశ చరిత్రలో ఓ కొత్త అధ్యాయమని బీఎన్‌పీ వర్గాలు తెలిపాయి. పార్లమెంటులోని 299 స్థానాల్లో 212 సీట్లను బీఎన్‌పీ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఇక జమాతే ఇస్లామీ పార్టీ 70 సీట్లలో, ఇతర స్వతంత్ర అభ్యర్థులు మిగిలిన స్థానాల్లో విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఇక బీఎన్‌పీకి చెందిన సీనియర్ హిందూ నేత గయేశ్వర్ కూడా ఈ ఎన్నికల్లో ఢాకా-3 నియోజకవర్గం నుంచి ఘన విజయం సాధించారు.

# 'ఉత్తర ప్రగల్భాలతో యుద్ధంలో విజయాలు వరించవు'- పాకిస్థాన్‌పై సీడీఎస్ చురకలు!

దాయాది పాకిస్థాన్‌పై సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ పరోక్ష విమర్శలు గుప్పించారు. కొన్ని దేశాలు ప్రగల్భాల ద్వారా విజయం సాధించామని భ్రమపడుతుంటాయని చురకలు అంటించారు. అలాంటి దేశాలకు విజయం ఎప్పటికీ వరించదన్నారు. శనివారం పుణెలో జరిగిన 'జై సే విజయ్ సెమినార్ ప్రారంభోత్సవంలో సీడీఎస్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన కీలక కామెంట్స్ చేశారు. భారత రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని సీడీఎస్ నొక్కి చెప్పారు. 2025 ఏప్రిల్‌లో పహల్గాంలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు జరిపిన దాడికి సమాధానంగా మే నెలలో భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయాన్ని సీడీఎస్ గుర్తుచేశారు. పాకిస్థాన్ పేరును నేరుగా ఎత్తకుండానే దాయాది దేశానికి సీడీఎస్ కౌంటర్ ఇచ్చారు. కూలిపోయిన ఉగ్రవాద స్థావరాలు, ధ్వంసమైన రన్‌వేలు, పనికిరాని వైమానిక రక్షణ వ్యవస్థల మీద నిజమైన విజయాన్ని ఎప్పటికీ నిర్మించలేరని పాకిస్థాన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.రాబోయే దశాబ్ద కాలంలో భారత రక్షణ రంగం ఎలాంటి సవాళ్లను ఎదర్కోబోతోందనే దానిపై సీడీఎస్ వివరించారు. మారుతున్న ప్రపంచంలో శాశ్వత మిత్రులు కానీ, శత్రువులు కానీ ఉండరని చెప్పుకొచ్చారు. ఎవరిని నమ్మాలో తెలియని పరిస్థితి నెలకొందని ఆయన అభిప్రాయపడ్డారు. అందుకే భారత్ మానసికగా, నిర్మాణపరంగా స్వతంత్ర నిర్ణయాలు తీసుకునేలా సిద్ధంగా ఉండాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు.భవిష్యత్ యుద్ధాలు అత్యంత పోటీతత్వంతో, అధునాతన సాంకేతికతతో కూడి ఉంటాయని, వాటిని ఎదుర్కోవడానికి కొత్త ఆలోచనలతో ముందుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ దేశాల



మధ్య భాగస్వామ్యాలు అవసరమే కానీ, అవి దేశ సొంత సామర్థ్యానికి ప్రత్యామ్నాయం కాకూడదని వ్యాఖ్యానించారు. వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి కోసం దేశీయ రక్షణ సామర్థ్యాన్ని పెంచుకోవాలన్నారు."విజయం అనేది కేవలం వాక్చాతుర్యం వల్ల వరించదు. మన పొరుగున ఉన్న కొన్ని దేశాలు కేవలం మాటలతో విజయాన్ని ప్రకటించుకున్నాయి. కానీ విజయం అనేది 'ఆపరేషన్ సిందూర్' సమయంలో మనం ప్రదర్శించినట్లుగా సాక్ష్యాధారాలతో నిరూపితమవ్వాలి. ధ్వంసమైన ఉగ్రవాద శిబిరాలు, దెబ్బతిన్న రన్‌వేలు, నిర్వీర్యమైన విమానశ్రయాలు, పనికిరాని వైమానిక రక్షణ వ్యవస్థల మీద విజయాన్ని నిర్మించలేరు. ఇటువంటి విజయాలు ఎంతో కాలం నిలవవు. రాబోయే దశాబ్ద కాలం కోసం భారత రక్షణ వ్యవస్థను, భవిష్యత్తులో మన ముందున్న సవాళ్లను నిశితంగా అంచనా వేయాలి. రాబోయే కాలం మరింత పోటీతత్వం, సాంకేతికంగా విచ్ఛిన్నకరంగా మారబోతోందని నేను నమ్ముతున్నాను" అని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు.ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్‌పై భారత్ విరుచుకుపడింది. ఈ దాడిలో పాకిస్థాన్ ఎయిర్ బేస్‌లు, రన్ వేలు ధ్వంసమయ్యాయి. కానీ, పాకిస్థాన్ మాత్రం తమ వైఫల్యాన్ని ఒప్పుకోలేదు. పైగా భారత దాడులను తిప్పికొట్టామని భారత్‌కు భారీ నష్టం చేకూర్చామని పాక్ మీడియాలో ఆ దేశ ఆర్మీ, ప్రభుత్వ పెద్దలు పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారు. భారత్ తన వైమానిక దాడుల వీడియోలను, శాటిలైట్ చిత్రాలను సాక్ష్యాలుగా చూపినా పాక్ ప్రభుత్వం అవన్నీ అబద్ధాలని కొట్టిపారేసింది. తమ దేశపు రక్షణ వ్యవస్థ విఫలమైందనే నిజాన్ని దాచిపెట్టి, కేవలం భావోద్వేగపూరిత ప్రసంగాల ద్వారా అక్కడి ప్రజలను రెచ్చగొట్టి వారి దృష్టిని మళ్లించడానికి ప్రయత్నించింది. ఇప్పటికీ పాకిస్థాన్ అలాంటి కామెంట్స్ చేస్తూ వస్తోంది. ఈ క్రమంలో పాకిస్థాన్ చేస్తున్న ఫేక్ ప్రచారాన్ని ఎండగట్టేందుకే సీడీఎస్ చౌహాన్ తాజాగా కౌంటర్ ఇచ్చారు.ఇదిలా ఉండగా, భారత్- చైనా సరిహద్దు వివాదాలు, టిబెట్ అంశంపై కూడా శుక్రవాం సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ మాట్లాడారు. ఈ అంశాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. టిబెట్ విషయంలో దశాబ్దాల క్రితమే భారత్ తీసుకున్న నిర్ణయాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వం 1954లోనే టిబెట్‌ను చైనాలో భాగంగా గుర్తించిందన్నారు. ఇరుదేశాల మధ్య కుదిరిన చారిత్రక 'పంచశీల ఒప్పందం'లో కూడా ఈ అంశం ప్రస్తావన ఉందని ఆయన గుర్తుచేశారు.

# మాది మానవ కులం కులరహిత గ్రామంగా సౌందలా ఏకగ్రీవ తీర్మానం

**మహారాష్ట్ర** : మహారాష్ట్ర లోని అహల్యానగర్ (అహ్మద్ నగర్) జిల్లాలో ఉన్న సౌందలా గ్రామ పంచాయతీ సంచలన తీర్మానాన్ని ఆమోదించింది. సౌందలాను కులరహిత గ్రామంగా ప్రకటించింది. 'మా అందరిది మానవ కులం' అని గ్రామస్థులు నినదించారు. ఫిబ్రవరి 5న ఉదయం ఈ ఊరిలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కుల,మతాలకు అతీతంగా గ్రామస్థులంతా పెద్దసంఖ్యలో తరలివచ్చి రక్తదానం చేశారు. ఆ వెంటనే గ్రామ సర్పంచ్ శరద్ అర్గాడే కీలక ప్రకటన చేశారు. కులమతాలకు అతీతంగా మనుషులందరి రక్తం ఎరుపు రంగులోనే ఉన్నందున, ఊరిని కులరహితంగా మారుద్దామని వెల్లడించారు. ఈమేరకు ప్రతిపాదనతో ఆయన ప్రవేశపెట్టిన తీర్మానంపై గ్రామ పంచాయతీ ఆమోద ముద్ర వేసింది. దీనిపై పూర్తి వివరాలతో 'ఈటీవీ భారత్' గ్రౌండ్ రిపోర్ అంటరానితనం, కుల వివక్షపైనే మా పోరాటం"సౌందలాను కులరహిత గ్రామంగా ప్రకటించాం. స్థానిక మరాఠీ భాషలో నేను ప్రవేశపెట్టిన తీర్మానానికి ఫిబ్రవరి 5న గ్రామసభ, సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామస్థుల ఏకగ్రీవ మద్దతు లభించింది. మతపరమైన ఘర్షణలను ఆపడానికి, శాంతి సందేశాన్ని వ్యాప్తి చేయడానికి, కుల వివక్షపై పోరాడటానికి, మానవ హక్కుల ఉల్లంఘనను నిలువరించడానికి ఈ నిర్ణయాన్ని తీసుకున్నాం. అంటరానితనం అనే దానికి తావు ఉండకూడదు. ప్రజల మధ్య సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావాన్ని పెంపొందించడమే మా లక్ష్యం. భారత రాజ్యాంగ ప్రవేశిక కూడా దేశ ప్రజల నుంచి ఇవే ఆశిస్తోంది. రాజ్యాంగ ప్రవేశిక నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు మా గ్రామస్థులంతా ఏకతాటిపైకి వచ్చారు. అందరిదీ మానవ కులమే అని తీర్మానించారు. మా తీర్మానాన్ని తదుపరిగా మహారాష్ట్ర ప్రభుత్వానికి పంపించనున్నాం" అని సర్పంచ్ శరద్ అర్గాడే 'ఈటీవీ భారత్'కు తెలిపారు.



# 'ది2021లో డీఎంకే ఓడిన సీట్లను మాకు ఇవ్వాలి- అధికారంలో వాటా కూడా కావాలి'- స్టాలిన్ వ్యాఖ్యల వేళ కాంగ్రెస్ డిమాండ్

**తమిళనాడు:** ప్రభుత్వ అధికారంలో తమకు వాటా కావాలని మరోసారి కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. 2021లో జరిగిన తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో డీఎంకే ఓడిపోయిన సీట్లను మాత్రమే తాము కోరుతున్నామని స్పష్టం చేసింది. ఈ మేరకు విరుద్‌నగర్ ఎంపీ, కాంగ్రెస్ అగ్రనాయకుడు మాణికం ఠాగూర్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. కాగా, తమిళనాడుకు సంబంధించినంత వరకు అధికారంలో వాటా అనేది సాధ్యపడదని ఇటీవలే ఓ కార్యక్రమంలో డీఎంకే నాయకుడు, సీఎం స్టాలిన్ వ్యాఖ్యానించారు. అంతలోనే అధికారంలో వాటా కోసం కాంగ్రెస్ నేత మాణికం ఠాగూర్ మరోసారి డిమాండ్ చేయడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.అధికారంలో వాటా తప్పనిసరిఈ ఏడాది జరగబోయే తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో డీఎంకే 170 స్థానాల్లో పోటీ చేస్తుందని రాష్ట్ర మంత్రి రాజా కన్నప్పన్ ఫిబ్రవరి 13న మదురైలో జరిగిన ఓ కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. అందులో 160 సీట్లలో డీఎంకే విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. 2021లో జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే ఓడిపోయిన



సీట్లనే తమ పార్టీ అడుగుతోందని అన్నారు.' '2021లో మీరు (డీఎంకే) 173 సీట్లలో పోటీ చేసి 133 స్థానాల్లో విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో డీఎంకే గెలవని సీట్లను మేము (కాంగ్రెస్) కోరుతున్నాం. అధికార భాగస్వామ్యం కూడా కావాలి. అధికారంలో వాటా మా పార్టీ హక్కు. ప్రజలే ఆ విషయాన్ని నిర్ణయిస్తారు" అని ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. దానికి మంత్రి రాజకన్నప్పన్ మాట్లాడిన వీడియోను అటాచ్ చేశారు. అధికారంలో వాటా డిమాండ్ చేస్తున్న కాంగ్రెసతమిళనాడులో మరికొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఈసారి తమకు ఎక్కువ సీట్లు ఇవ్వాలని డీఎంకేను కోరుతోంది. అలాగే ఎన్నికల తర్వాత అధికారంలో కూడా తమకు వాటా ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. ఇదే విషయంపై డీఎంకే చీఫ్, ముఖ్యమంత్రి స్టాలిన్ ఇటీవల ఓ కార్యక్రమంలో స్పందించారు. అధికారంలో వాటా అనే వాదన తమిళనాడుకు సరిపోదని, ఆ విషయం డీఎంకే, కాంగ్రెస్‌కు తెలుసన్నారు. మధ్యలో ఉన్న కొందరు కూటమిని చీల్చేందుకు చేస్తున్న కుట్రే ఈ ప్రచారమని వ్యాఖ్యానించారు. దీన్ని కూటమిని బలహీనపరచే ప్రయత్నంగా కొట్టిపారేశారు.అలాగే కూటమిలో అంతర్గత విభేదాలు ఉన్నాయనే ప్రచారాన్ని కూడా స్టాలిన్ ఖండించారు. డీఎంకే కూటమిలో ఎలాంటి సమస్యలు లేవని, పరస్పర అవగాహనతోనే ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. కాంగ్రెస్‌తో కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తామని స్పష్టం చేశారు. తమిళనాడు ఎప్పటి నుంచో స్వయం ప్రతిపత్తి, కేంద్రంలో సమాఖ్య వ్యవస్థ అనే సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్తోందని అన్నారు. ఇక్కడ అధికార భాగస్వామ్యం అనే భావనకు స్థానం లేదని, కూటమిలోని మిత్రపక్షాలన్నీ దీన్ని అంగీకరించాయని చెప్పారు.

# కర్ణాటక సీఎం సిద్ధరామయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం డీకే

**కర్ణాటకు:** సిద్ధరామయ్య మధ్య సీఎం పదవి కోసం గత కొంతకాలంగా బయటపడని వివాదం కొనసాగ ుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఆశ్చర్యకరమైన ఘటన చోటుచేసుకుంది. కర్ణాటకలోని హవేరీలో జరిగిన భారీ బహిరంగ సభలో సీఎం సిద్ధరామయ్య నిలువెత్తు విగ్రహాన్ని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ద్వారా ఇద్దరి మధ్య ఆధిపత్య పోరు ఉంద ్నే ప్రచారానికి చెక్ పెట్టే ప్రయత్నం చేసినట్లు కనిపిస్తోంది.సిద్ధరామయ్య నాయకత్వంలో కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలననువిజయవంతంగా పూర్తి చేసుకుంది. ఈ సంద ర్భంగా సీఎం విగ్రహావిష్కరణ జరిగింది. పార్టీలో ఐక్యతను, సమష్టి కృషిని ప్రజలకు చాటడమే ఈ కార్యక్రమం లక్ష్యమని డీకే శివకుమార్ స్పష్టంచేశారు. గ్యారంటీ పథకాల అమలులో సిద్ధరామయ్య పోషించిన పాత్రను కొనియాడుతూ.. ఆయన చరిత్రలో ప్రజా నాయకుడిగా నిలిచిపోతారని అన్నారు.విగ్రహావిష్కరించిన తర్వాత సిద్ధరామయ్యకు డీకే శివకుమార్ ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇద్దరూ ఒకే వేదికపై కనిపించడం, ఒకరినొకరు గౌరవించడం రాష్ట్ర రాజకీయాల్లోచర్చనీయాంశమైంది. సిద్ధరామయ్య సైతం తన విగ్రహాన్ని డీకే ఆవిష్కరించడంపట్ల హర్షం వ్యక్తంచేశారు. ఇది తన వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదని, కాంగ్రెస్ పార్టీ సమష్టి కృషికి దక్కిన గుర్తింపని ఆయన వ్యాఖ్యానించారు. సీఎం పదవి రేసులో పోటీ పడుతున్న ఈ ఇద్దరు ఇలాంటి ఐక్యతను చూపడంరాష్ట్ర రాజకీయాలకు కొత్త సంకేతంగా మారింది.



# రష్యా చమురు దిగుమతులను భారత్ నిలిపివేస్తుందా

**రష్యా** చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేస్తుందంటూ అమెరికా ప్రకటించిన నేపథ్యంలో భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ తాజాగా స్పందించారు. వ్యూహాత్మక ప్రాముఖ్యత ఉన్న అంశాల్లో స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవడమే భారత దేశ విధానమని మంత్రి స్పష్టం చేశారు . జర్మనీలోని ప్రస్తుతం జరుగుతున్న మ్యూనిచ్ సెక్యూరిటీ కాన్ఫరెన్స్‌లో మంత్రి జైశంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రష్యా చమురు కొనుగోళ్లపై విలేకరులు ఆయనను ప్రశ్నించారు. అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందంలో భాగంగా రష్యా చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేయనుందా? అని ప్రశ్నించారు. ఇది దేశ



వ్యూహాత్మక నిర్ణయాలపై ప్రభావం చూపుతుందా? అని అడిగారు.ఈ ప్రశ్నలకు మంత్రి జైశంకర్ స్పందిస్తూ ఇంధన కొనుగోళ్ల అంశం సంక్లిష్టమైనదని అన్నారు. ఇతర దేశాల్లోని సంస్థల వలెనే భారతీయ ఇంధన కంపెనీలు కూడా తమ ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటాయని తెలిపారు. ధరలు, ఇంధన లభ్యత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. ఇక భారత్ ఎల్లప్పుడూ పూర్తి స్వాతంత్ర్యంతో వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. భారత దేశ చరిత్ర చూస్తే ఇది స్పష్టంగా అర్థమవుతుందని అన్నారు.భారత్‌తో కుదిరిన వాణిజ్య ఒప్పందంపై అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో శనివారం స్పందించారు. రష్యా కొనుగోళ్లను నిలిపివేస్తామంటూ భారత్ తమకు హామీ ఇచ్చిందని అన్నారు.

# మెట్రో స్లాబ్ కూలిన ఘటనలో ఐదుగురు అరెస్ట్.. కాంట్రాక్టర్లకు రూ.6 కోట్లు జరిమానా

**ముంబై:** మహారాష్ట్ర రాజధాని ముంబైలో మెట్రో స్లాబ్ కూలిన సంఘటనపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌ను సస్పెండ్ చేసింది. ఈ ప్రాజెక్టులో పాల్గొన్న కాంట్రాక్టర్లకు రూ.6 కోట్ల జరిమానా విధించింది. (నిర్మాణ సంస్థకు చెందిన ఐదుగురిని పోలీ సులు అరెస్ట్ చేశారు. శనివారం మధ్యాహ్నం ములుం డ్‌లోని ఆర్టరీ ఎల్‌బిఎస్ మార్గ్‌లో నిర్మాణంలో ఉన్న మెట్రో లైన్ స్లాబ్ ఊడింది. రోడ్డుపై వెళ్తున్న ఆటో, ఒక కారుపై ఆ భారీ స్లాబ్ పడింది. ఒక వివాహానికి వెళ్తున్న స్థానిక సమాజ్‌వాదీ పార్టీ నేత, గ్రామ పెద్ద రామ్‌ధన్ యాదవ్ ఈ ప్రమాదంలో మరణిం చారు. మరో ముగ్గురు గాయపడ్డారు.కాగా, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, పట్టణాభివృద్ధి మంత్రి ఏక్‌నాథ్ షిండే ఈ సంఘటనపై సీరియస్‌గా స్పందించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్యజీత్ సాల్వే ను సస్పెండ్ చేయాలని ఆదేశించారు.అలాగే యాదవ్ కుటుంబానికి పరిహారాన్ని రూ.15 లక్షలకు పెంచినట్లు షిండే వెల్లడించారు.



Edited,Printed,Published and Owend by Mare Chinnababu , Printed at sravanthi prienters , rtc crass road ,Hyderabad-500001. Published at Plat no : 223 , Gajula Ramaram , Road 1, Hyderabad - 500001, Telangana. Editor : Mare Chinnababu , (TGTEL/33/B45017 ) e-mail : vaarthpatrika@gmail.com , Cell : 9490617567 , 99081 21111,